JAYABHERIDAILY.COM
తెలుగు దినపత్రిక
# ప్రభాత జయభేరి
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
మేడ్చల్ - మల్కాజిగిరి । గురువారం 04-12-2025
Medchal - Malkajgiri । Thursday 04-12-2025
jayabherinews
సంపుటి : 02 । సంచిక : 188 । పేజీలు : 8 । వెల : 5
Vol. 02 । Issue 188 । Pages : 8 । ₹: 5

## విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com





త్వరలోనే మరో 40 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన రెండున్నర సంవత్సరాల్లో మొత్తం లక్ష ఉద్యోగాలను భర్తీ చేస్తామని చెప్పారు.

# యువతకు ఉద్యోగ..ఉపాధి అవకాశాలు

- హుస్నాబాద్‌లో రూ. 262.78 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలు
- గత పదేళ్ల కాలంలో నిర్లక్ష్యానికి గురైన గౌరెల్లి రిజర్వాయర్
- అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే 60 వేల ఉద్యోగాల భర్తీ
- త్వరలోనే మరో 40 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ

**జయభేరి, హైదరాబాద్ :**

ప్రజా పాలన - ప్రజా విజయోత్సవాలు కార్యక్రమంలో భాగంగా సిద్ధిపేట జిల్లా హుస్నాబాద్‌లో రూ. 262.78 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. రూ. 44.12 కోట్లతో హుస్నాబాద్‌లో ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణం. రూ. 45.15 కోట్లతో హుస్నాబాద్‌లో ATC ఏర్పాటుకు శంకుస్థాపన. రూ. 20 కోట్లతో హుస్నాబాద్ మునిసిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులు. రూ. 8.60 కోట్లతో RTA యూనిట్ కార్యాలయం. రూ. 86 కోట్లతో హుస్నాబాద్ అర్బన్ కొత్తపల్లి ప్యాకేజీ1 లో భాగంగా 4 లైన్ల రహదారి నిర్మాణం. రూ. 58.91 కోట్లతో హుస్నాబాద్ అక్కన్నపేట 4 లైన్ల రహదారి నిర్మాణం. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ప్రజాప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తి చేసుకుంటున్న నేపథ్యంలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. హుస్నాబాద్‌ను అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. గత పదేళ్ల కాలంలో నిర్లక్ష్యానికి గురైన గౌరెల్లి రిజర్వాయర్ పనులను పూర్తి చేసే బాధ్యత తీసుకుంటామన్నారు. గడీలు, పెత్తందార్లకు వ్యతిరేకంగా సర్దార్ పాపన్న గౌడ్ నాయకత్వంలో బహుజనుల రాజ్య స్థాపనకు ఇక్కడి నుంచి శ్రీకారం చుట్టారని ఆ ప్రాంత ప్రాధాన్యతను గుర్తుచేశారు. తెలంగాణ మలిదశ ఉద్యమానికి కరీంనగర్ జిల్లా అండగా నిలిచిన తీరు, సోనియా గాంధీ ఇచ్చిన మాట, తెలంగాణ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కాలని డిసెంబర్ 3 న తెలంగాణ కోసం శ్రీకాంతా చారి బలిదానం చేసుకున్న ఘటనను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రస్తావిస్తూ, శ్రీకాంతా చారి ఆశయ సాధనలో భాగంగా ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోపు 60 వేల ప్రభుత్వ

...మిగతాది 2 లో

మింగడానికి మెతుకు లేదు కానీ..

# మీసాలకు సంపంగి నూనె..

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరు పై బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శలు



**జయభేరి, హైదరాబాద్, డిసెంబర్ 3:**

మింగడానికి మెతుకు లేదు కానీ.. మీసాలకు సంపంగి నూనె అన్నట్టుంది రేవంత్ రెడ్డి తీరు అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. ఓయూ లా కాలేజీ మెస్‌లో పాడైపోయిన అన్నం పెడుతున్నారని విద్యార్థులు రోడ్డుపైకి వచ్చి ఆందోళన చేయడం కాంగ్రెస్ పాలనలో విద్యావ్యవస్థ దుస్థితికి అద్దం పడుతోందని అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీకి 1000 కోట్లు ఇస్తానని ప్రగల్భాలు పలికిన ముఖ్యమంత్రి గారు.. కనీసం విద్యార్థులకు ఒక పూట మంచి భోజనం పెట్టలేకపోవడం సిగ్గుచేటు అని హరీశ్‌రావు విమర్శించారు. ప్రభుత్వ బడుల్లో మధ్యాహ్న భోజనంలో గొడ్డుకారం, గురుకులాల్లో పురుగుల అన్నం, ఇప్పుడు యూనివర్సిటీల్లో పాడైపోయిన భోజనం.. ఇదేనా కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో సాధించిన ఘనత అని నిలదీశారు. అడుగడుగునా యూనివర్సిటీ పర్యవేక్షణలో ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తున్నదని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖ మంత్రిగా పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. రేవంత్ రెడ్డి గారూ.. మీ చేతగానితనంతో విద్యార్థుల భవిష్యత్తును, ఆరోగ్యాన్ని ఆగం చేయకండి అని హరీశ్‌రావు హితవుపలికారు. ఇప్పటికైనా ప్రగల్భాలు మాని.. విద్యార్థులకు కడుపునిండా మంచి భోజనం పెట్టండని సూచించారు. మింగడానికి మెతుకు లేదు కానీ.. మీసాలకు సంపంగి నూనె అన్నట్టుంది రేవంత్ రెడ్డి గారి తీరు. ఓయూ లా కాలేజీ మెస్‌లో పాడైపోయిన అన్నం పెడుతున్నారని విద్యార్థులు రోడ్డుపైకి వచ్చి ఆందోళన చేయడం కాంగ్రెస్ పాలనలో విద్యావ్యవస్థ దుస్థితికి అద్దం పడుతోంది.

# రేవంత్ అధికార దుర్వినియోగం చేస్తున్నారు

- జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత




**జయభేరి, హైదరాబాద్, డిసెంబర్ 3:**

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రజాధనంతో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారని జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ఎన్నికల కమిషనర్ ను కలిసి ఫిర్యాదు చేశారు. సర్పంచ్ ఎన్నికలు జరుగుతున్నా సీఎం టూర్ షెడ్యూల్ ప్రకటించిన నాటి నుంచి మేము అభ్యంతరం చెబుతున్నామని.. అర్బన్ ఏరియాల్లో ప్రజాధనంతో మీటింగ్ పెట్టి సర్పంచ్ ఎన్నికల్లో సీఎం ఓట్లు అడిగే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ టూర్ మీద ఆంక్షలు పెట్టాలి. లేదంటే నిలిపివేయాలని మొదటి రోజే మేము డిమాండ్ చేశామని.. ఎన్నికల కమిషన్ కు లేఖ కూడా రాశామన్నారు. ఆ సందర్భంగా ఎన్నికల నియమావళికి అనుగుణంగా వ్యవహరించాలని ప్రభుత్వానికి

...మిగతాది 2 లో

# సీఎం లోకేష్.. టాక్ ఆఫ్ హస్తిన

**జయభేరి, న్యూఢిల్లీ, డిసెంబర్ 3:**

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఢిల్లీ స్థాయిలో పట్టు సంపాదించారు. ఏపీకి భవిష్యత్ నేతగా ఇప్పటికే హస్తినలో ముద్రపడిపోయారు. అనేక మంది కేంద్ర మంత్రులు సయితం లోకేశ్ త్వరలోనే కీలకమైన పదవి చేపట్టనున్నారని వ్యాఖ్యానిస్తున్నారు. కేవలం రెండేళ్లలోనే లోకేశ్ ఈ రేంజ్ లో దూసుకుపోయారు. తండ్రి చంద్రబాబు రాజకీయ వారసత్వంతో పాటు తండ్రి ఎన్టీఆర్ లెగసీని కూడా ఒడిసిపట్టుకుని తాను నాయకుడుగా ఎదిగేందుకు ఉపయోగించుకున్నారు. ఇప్పటికే హస్తినలో లోకేశ్ గురించి పెద్ద స్థాయిలో చర్చ జరుగుతుంది. చంద్రబాబు నాయుడు ఇప్పటికే నాలుగు దఫాలుగా ముఖ్యమంత్రిగా బాధ్యతలను చేపట్టడంతో లోకేశ్ పగ్గాలు చేపట్టడం ఎంతో దూరం లేదని అనుకుంటున్నారు. నేడు కూడా ఢిల్లీలో ఆయన పర్యటిస్తున్నారు. కానీ చంద్రబాబు నాయుడు వయసు మీదపడినా ఆరోగ్యంగా ఫిట్ గా ఉన్నారు. ఆయన ఏపీ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్నారు. బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ తరహాలో ఎక్కువ కాలం రాష్ట్ర రాజకీయాల్లోనే ఉండాలని భావిస్తున్నారు. కానీ దీపం ఉండగానే ఇల్లు చక్కపెట్టుకోవాలని భావించిన చంద్రబాబు నిన్న మొన్నటి వరకూ పార్టీ కార్యక్రమాలతో పాటు అన్ని విషయాలను లోకేశ్ కు అప్పగించిన చంద్రబాబు పాలనపరమైన



...మిగతాది 2 లో





# సెకండ్ కోసం కమలం కసరత్తు

- 2028 ఎన్నికలే లక్ష్యంగా దిశానిర్దేశం
- సర్పంచ్ ఎన్నికలను సీరియస్‌గా తీసుకోవాలని సూచించార
- సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీల్లో బీజేపీ వాటా అంతంత మాత్రమే

**జయభేరి, హైదరాబాద్, డిసెంబర్ 3:**

తెలంగాణ సర్పంచ్ ఎన్నికలపై అన్ని పార్టీలు సీరియస్‌గా ఫోకస్ పెట్టాయి. రాబోయే ఎన్నికల్లో మళ్లీ గెలవాలంటే గ్రామాల్లో బలంగా ఉండాలని..సర్పంచ్ ఎన్నికల్లో అప్పర్ హ్యాండ్ కోసం అధికార కాంగ్రెస్.. ప్రతిపక్ష బీఆర్ఎస్

...మిగతాది 2 లో




# సంచార్ సేథీపై బ్యాక్ టర్న్

**జయభేరి, న్యూఢిల్లీ, డిసెంబర్ 3:**

మొబైల్ ఫోన్‌లలో సంచార్ సాథీ యాప్ ప్రీఇన్‌స్టలేషన్‌పై కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ప్రతిపక్షాల నుంచి వ్యతిరేకత వ్యక్తమైన నేపథ్యంలో, ఈ యాప్ ప్రీఇన్‌స్టలేషన్ తప్పనిసరి కాదని కేంద్రం స్పష్టం చేసింది. ఈ మేరకు ముందస్తు ఇన్‌స్టలేషన్ ఉత్తర్వును వెనక్కి తీసుకుంది. కొత్త స్మార్ట్ ఫోన్‌లలో, అలాగే ఇప్పటికే ఉన్న పరికరాల్లో సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ ద్వారా సంచార్ సాథీ యాప్‌ను ప్రీఇన్‌స్టాల్ చేయాలని టెలికమ్యూనికేషన్స్ విభాగం (డీవోటీ) నవంబర్ 28న ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, ఈ నిర్ణయంపై ఇప్పుడు కేంద్రం వెనక్కి తగ్గింది.

...మిగతాది 2 లో



# కేటీఆర్ కు జగ్గారెడ్డి వార్నింగ్

- కేసీఆర్ కుటుంబం ఉద్యమం సమయంలో రాజకీయం చేసిందని విమర్శ

**జయభేరి, హైదరాబాద్, డిసెంబర్ 3:**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణలో రాజకీయాలు చేసుకోవచ్చని, ఆయనను ఎదుర్కొనేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, తాము సిద్ధంగా ఉన్నామని తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి స్పష్టం చేశారు. అయితే, జాతీయ నాయకుడు రాహుల్ గాంధీని విమర్శిస్తే మాత్రం ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు. గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమం సమయంలో కేసీఆర్ కుటుంబం రాజకీయ లబ్ధి పొందిందని ఆరోపించారు. తమ పార్టీ అగ్రనేత

...మిగతాది 2 లో



# పుతిన్ భారత్ పర్యటన..

## డిసెంబర్ 4-5న ఢిల్లీలో భారత్-రష్యా శిఖరాగ్ర సదస్సు

**జయభేరి, న్యూఢిల్లీ:**

యావత్ ప్రపంచం దృష్టి ఇప్పుడు భారత్‌పైనే ఉంది. అగ్రరాజ్యం అమెరికా సహా NATO కూటమిలోని అన్ని దేశాలకు చుక్కలు చూపిస్తున్న రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ రెండ్రోజుల పాటు భారత్‌లో పర్యటించమే ఇందుకు కారణం. ముఖ్యంగా అమెరికాతో పాటు పొరుగునే ఉన్న పాకిస్తాన్ కూడా ఈ పర్యటనను నిశితంగా గమనిస్తోంది. భారతదేశానికి చిరకాల మిత్రదేశంగా ఉన్న రష్యా.. దశాబ్దాలుగా భారత్‌కు ఆయుధాలు, రక్షణ పరికరాలను అందించడమే కాదు.. సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా అందజేస్తూ వచ్చింది. అనునిత్యం ఆ దేశంతో భారత్ ఎన్నో రంగాల్లో ఒప్పందాలు చేసుకుంటూ ఉంది. పుతిన్ తాజా పర్యటనతో భారత్‌రష్యా మధ్య ఏయే రంగాల్లో ఎలాంటి ఒప్పందాలు, MoUలు జరుగుతాయన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆహ్వానం మేరకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ డిసెంబర్ 45 తేదీల్లో భారత్‌లో అధికారిక పర్యటన నిర్వహించనున్నారు. ఈ పర్యటన సందర్భంగా రెండు దేశాల మధ్య

...మిగతాది 2 లో

జీవితం అంటే.. బ్రతకడమేనా!?

2 లో

మొదటిపేజీ తరువాయి

## యువతకు ఉద్యోగ.. ఉపాధి అవకాశాలు

ఉద్యోగాలను భర్తీ చేశామని చెప్పారు. ప్రజల ఆకాంక్ష మేరకు ఏర్పడిన ప్రజాప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న తరుణంలో భవిష్యత్తులో తెలంగాణను ఏ విధంగా అభివృద్ధి చేయాలన్న ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు. రైతులకు రుణమాఫీ, రైతు భరోసా వంటి వ్యవసాయ రంగంలో 1.04 లక్షల కోట్ల రూపాయలను వెచ్చించినట్టు తెలిపారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళా సంఘాలకు సోలార్ విద్యుత్, రేషన్ కార్డుల జారీ, సన్నబియ్యం పంపిణీ, 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు, అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే 60 వేల ఉద్యోగాల భర్తీ.. ఇలా చెప్పుకుంటూ వెళితే అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామని గుర్తుచేశారు.

## సంచార్ సేథీపై బ్యాక్ టర్న్

సైబర్ నేరాల నుంచి రక్షణ కోసం సంచార్ సాథీ యాప్‌ను ముందస్తుగానే ఇన్‌స్టాల్ చేసి ఇవ్వాలన్న కేంద్రం ఆదేశాలు దుమారం రేపాయి. ఇది ప్రజల వ్యక్తిగత జీవితాల్లోకి చొరబడటమేనని ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేశాయి. అయితే, యాప్‌ను ఇన్‌స్టాల్ చేసినప్పటికీ, వినియోగదారులు తొలగించుకోవచ్చని, రిజిస్టర్ అయిన తర్వాతే అది పనిచేయడం ప్రారంభిస్తుందని ప్రభుత్వం వివరణ ఇచ్చింది. అయినప్పటికీ, ప్రతిపక్షాలు తమ ఆందోళనను కొనసాగించాయి. ఇదిలా ఉండగా, ఇప్పటికే 1.5 కోట్ల మందికి పైగా సంచార్ సాథీ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారు.

## కేటీఆర్ కు జగ్గారెడ్డి వార్నింగ్

రాహుల్ గాంధీని విమర్శించే స్థాయి, ప్రశ్నించే హక్కు కేటీఆర్‌కు లేదని ఆయన అన్నారు. రాహుల్ గాంధీది త్యాగాల కుటుంబమని, కేసీఆర్ కుటుంబం ఉద్యమం జరుగుతున్నప్పుడే రాజకీయంగా ఎదిగిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయాలు ఏమాత్రం మంచిది కాదని ఆయన హితవు పలికారు. కేటీఆర్‌కు నైతిక విలువలు ఉంటే రాహుల్ గాంధీ గురించి మరోసారి ఇష్టానుసారంగా మాట్లాడవద్దని అన్నారు. కాంగ్రెస్ జాతీయ పార్టీ అని, బీఆర్ఎస్ ప్రాంతీయ పార్టీ అని గుర్తు చేశారు. కేటీఆర్ తెలంగాణలో రాజకీయం చేసుకోవచ్చని, కానీ రాహుల్ గాంధీని విమర్శించవద్దని ఆయన తేల్చి చెప్పారు.

## సెకండ్ కోసం కమలం కసరత్తు

ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నాయి. అయితే బీజేపీ కూడా తామేం తక్కువ కాదంటోంది. కాంగ్రెస్‌కు ఆల్టర్నేట్ తామేనని చెప్తున్న కమలనాథులు.. సర్పంచ్ ఎన్నికల్లో దాన్ని ప్రూవ్ చేయాలని భావిస్తున్నారట.బీజేపీ జాతీయ సంస్థాగత ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ పార్టీ నేతలతో కీలక సమావేశం నిర్వహించి..2028 ఎన్నికలే లక్ష్యంగా దిశానిర్దేశం చేశారట. ఇప్పటినుంచే కార్యాచరణ సిద్ధం చేసి వాటి అమలుకు నాయకులు సంసిద్ధంగా ఉండాలని డైరెక్షన్స్ ఇచ్చారట. లోకల్ బాడీ ఎన్నికల్లో సత్తా చాటితేనే..పార్టీని బూత్ లెవల్‌కు తీసుకెళ్లగలుగుతామని.. అందుకోసం సర్పంచ్ ఎన్నికలను సీరియస్‌గా తీసుకోవాలని సూచించారట. తెలంగాణలో బీజేపీకి ఎనిమిది మంది లోక్‌సభ, ఇద్దరు రాజ్యసభ సభ్యులు, ఏడుగురు ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎమ్మెల్సీలు ఉన్నారు. సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీల్లో బీజేపీ వాటా అంతంత మాత్రమే. ఇప్పటికీ ఆ పార్టీకి సంస్థాగత నిర్మాణం అంత స్ట్రాంగ్‌గా లేదు. అయినా మోదీ వేవ్.. బీఆర్ఎస్ క్యాడర్ ఓటమి నైరాశ్యంతో లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి 8 సీట్లు వచ్చాయన్న చర్చ ఉంది. అయితే గత ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడినప్పటి నుంచి కాంగ్రెస్‌కు తామే ప్రత్యామ్నాయమని.. రాబోయే ఎన్నికల్లో అధికారంలోకి వస్తామని చెప్పుకుంటున్నారు కమలనాథులు.కాంగ్రెస్‌కు ఆల్టర్నేట్ బీజేపీ అని ప్రూవ్ చేసుకోవాలంటే సర్పంచ్ ఎన్నికల్లో సత్తా చాటాల్సిన పరిస్థితి ఏర్పడింది. మూములుగా అయితే లోకల్ బాడీ ఎన్నికల ఫలితాలు అధికార పార్టీకి అనుకూలంగా వస్తుంటాయ్. అయినప్పటికీ బీజేపీ ఈ స్థానిక ఎన్నికలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటుందట.అధికార కాంగ్రెస్‌కు ఆల్టర్నేట్ తామేనని చెప్పుకోవాలంటే కనీసం సెకండ్ ప్లేస్‌లో అయినా నిలవాలని భావిస్తున్నారట బీజేపీ లీడర్లు. సర్పంచ్ ఎన్నికలు పార్టీ గుర్తుల మీద జరగనప్పటికీ అన్ని సర్పంచ్ స్థానాల్లో బీజేపీ మద్దతుదారులను నిలబెట్టాలని అనుకుంటున్నారట. అంతే కాకుండా బీఆర్ఎస్‌ను ఓవర్ కమ్ చేసి రెండో ప్లేస్‌లో నిలవడం ద్వారా వచ్చే ఎన్నికల్లో విజయం తమదేనని చెప్పుకొవాలనుకుంటున్నారట.సర్పంచ్ ఎన్నికల్లో సత్తా చాటేందుకు ఇప్పటికే బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు వారివారి నియోజకవర్గాల్లో కార్యాచరణను అమలు చేస్తున్నారట. ఇందులో భాగంగానే కేంద్రమంత్రి బండి సంజయ్ బీజేపీ మద్దతుదారులను ఏకగ్రీవంగా ఎన్నుకుంటే పది లక్షల నజరానా ప్రకటించారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్, మెదక్ ఎంపీ రఘునందన్ రావు నియోజకవర్గాల్లోనే తిష్టవేసి పార్టీకి పట్టున్న దగ్గర గెలుపు గుర్రాలను బరిలోకి దింపుతున్నారట. ఎమ్మెల్యేలు మహేశ్వర్ రెడ్డి, పాయల్ శంకర్, పాల్వాయి హరీష్‌బాబు వంటి నేతలు తమ నియోజకవర్గాల్లో మెజారిటీ సర్పంచ్ స్థానాలను కైవసం చేసుకునేందుకు వ్యూహాలు రచిస్తున్నారట. ఎంపీలు, ఎమ్మెల్యేలు లేని దగ్గర స్వయంగా పార్టీనే రంగంలోకి దిగి అభ్యర్థులను నిలబెట్టడం, అభ్యర్థులు లేని దగ్గర బరిలో ఉన్న స్థానిక లీడర్లకు పార్టీ మద్దతు ఇవ్వడానికి రెడీగా ఉన్నారట. బీఎల్ సంతోష్ చేసిన దిశానిర్దేశం ప్రకారం సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను వెనక్కి నెట్టి రెండో స్థానంలో నిలవాలని పట్టుదలతో పనిచేస్తున్నారట. మరి కమలనాథుల కసరత్తు ఎంతవరకు వర్కౌట్ అవుతుందో.? ఏ మేరకు సత్తా చాటుతారో.. వేచి చూడాలి.

## పుతిన్ భారత్ పర్యటన..

విస్తృతమైన ద్వైపాక్షిక అంశాలపై సమగ్ర చర్చలు జరగనున్నాయని క్రెమ్లిన్ అధికార ప్రతినిధి యూరీ ఉషకోవ్ డిసెంబర్ 3న జరిగిన మీడియా సమావేశంలో తెలిపారు. ఈ ఏడాది ఇద్దరు నాయకులు సెప్టెంబర్ 1న చైనాలోని తియాంజిన్‌లో జరిగిన SCO శిఖరాగ్ర సమావేశంలో సమావేశమయ్యారు. ఆ తర్వాత కూడా 5 పర్యాయాలు టెలిఫోన్‌లో మాట్లాడుకున్నారు. అంతేకాక మాస్కోలో రష్యా అధ్యక్షుడు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, రెండుసార్లు విదేశాంగ మంత్రి డా. ఎస్. జైశంకర్‌లను కలుసుకున్నారు. డిసెంబర్ 21న రష్యాభారత్ సంబంధాల్లో 'విశేష, ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం'పై చేసిన సంయుక్త ప్రకటనకు 15 ఏళ్లు పూర్తవుతున్నాయి. రాజకీయ, భద్రత, ఆర్థిక, రవాణాలాజిస్టిక్స్, విజ్ఞాన శాస్త్రంసాంకేతికత, విద్యసంస్కృతి రంగాల్లో సహకారం వేగంగా విస్తరిస్తోందని ఉషకోవ్ పేర్కొన్నారు.

**పర్యటనలో ముఖ్య అంశాలు:**

డిసెంబర్ 4న పుతిన్‌మోదీ మధ్య అనధికారిక భేటీ, డిసెంబర్ 5న అధికారిక చర్చలు, భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో ప్రత్యేక భేటీ, రష్యాభారత్ వ్యాపార వేదిక సందర్శన, ఢిల్లీలో RT India టెలివిజన్ ఛానెల్ ప్రారంభోత్సవం (పుతిన్, RT చీఫ్ మార్గరిటా సిమోన్యాన్ హాజరు), సంయుక్త ప్రకటన విడుదల, 2030 వరకు వ్యూహాత్మక ఆర్థిక సహకార కార్యక్రమం ఆమోదం.

2024లో ద్వైపాక్షిక వాణిజ్యం 12 శాతం పెరిగి 63.6 బిలియన్ డాలర్లకు చేరింది. పారిశ్రామిక సహకారం, ఆధునిక సాంకేతికతలు, రవాణా, శాంతియుత అంతరిక్ష పరిశోధన, గనులు, ఆరోగ్యం, కార్మిక వలస కార్యక్రమాలు వంటి అనేక పెద్ద ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నాయి. 2024లో 80 వేలకు పైగా రష్యన్లు భారత్‌ను సందర్శించగా, 40 వేలకు పైగా భారతీయులు రష్యాకు వెళ్లారు. ఈ రంగంలో ఇంకా ఎక్కువ సామర్థ్యం ఉందని ఉషకోవ్ అన్నారు. పర్యటనలో 10 ఒప్పందాలు ప్రభుత్వాల మధ్య (GG) జరుగుతాయి. 15కు పైగా వాణిజ్యవాణిజ్యేతర సంస్థల మధ్య ఒప్పందాలు కుదురనున్నాయి. వాటిలో ముఖ్యమైనవి: 2030 వరకు సాంస్కృతిక మార్పిడి కార్యక్రమం. రష్యా 'ఇంటర్నేషనల్ బిగ్ క్యాట్ అలయన్స్'లో చేరిక. తాత్కాలిక ఉపాధి & చట్టవిరుద్ధ వలసల నిరోధంపై ఒప్పందాలు. మాదకద్రవ్యాల ముప్పుకు వ్యతిరేకంగా సంయుక్త చర్యల ప్రణాళిక, వైద్య విద్యవిజ్ఞాన రంగంలో సహకారం, ధ్రువ ప్రాంత నౌకాశ్రయ నిపుణుల శిక్షణపై MoU, ఆహార భద్రతలో రోస్‌పోట్రెబ్‌నాడ్‌జోర్ - FSSAI ఒప్పందం, ద్రవ రాకెట్ ఇంజన్ ఉత్పత్తిలో రోస్‌కాస్మోస్‌భారత అంతరిక్ష శాఖ MoU. ఐక్యరాజ్యసమితి, SCO, G20, BRICSలో సహకారం, 2026లో భారత్ అధ్యక్షత వహించే BRICS అంశాలపై కూడా నాయకులు పరస్పరం చర్చించుకుని అభిప్రాయాలు పంచుకోనున్నారు. పుతిన్‌తో పాటు ఏడుగురు మంత్రులు (రక్షణ మంత్రి బెలౌసోవ్, ఆర్థిక మంత్రి సిలువానోవ్, సెంట్రల్ బ్యాంక్ గవర్నర్ నబియుల్లినా తదితరులు), పెద్ద వ్యాపార బృందం ఢిల్లీకి రానున్నారు. ఈ పర్యటన ద్వారా రష్యాభారత్ విశేష వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలోపేతం కానుందని, రెండు దేశాలూ అంతర్జాతీయ వేదికలపై సన్నిహిత సహకారాన్ని కొనసాగించనున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ఆర్థిక వృద్ధిలో దూసుకెళ్తోన్న భారత్



భారత ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం బలంగా, స్థిరంగా పెరుగుతున్నదని తాజా లెక్కలు స్పష్టంగా తెలియజేస్తున్నాయి. జీడీపీ భారీ పెరుగుదలను నమోదు చేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో భారతదేశ వృద్ధి రేటు సాధించింది. శుక్రవారం విడుదలైన తాజా అధికారిక గణాంకాల ప్రకారం, సెప్టెంబర్ 30, 2025 ముగిసే రెండవ త్రైమాసికంలో భారతదేశ స్థూల దేశీయోత్పత్తి 8.2 శాతంగా పెరుగుదల నమోదు చేసింది. భారత ఆర్థిక వ్యవస్థ సెప్టెంబర్ 2024 త్రైమాసికంలో 5.6% వృద్ధి చెందింది ఇది ఏడు త్రైమాసికాలలో అత్యల్ప రేటు. మునుపటి త్రైమాసికంలో 7.8% నుంచి కోలుకుంది. భారతదేశ రెండవ త్రైమాసిక జీడీపీ డేటా విడుదలైంది. 2025-26 ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్ త్రైమాసికంలో స్థూల దేశీయోత్పత్తి 8.2 శాతం పెరిగింది. 2025, 26 ఆర్థిక సంవత్సరం రెండవ త్రైమాసికంలో వాస్తవ ధరల వద్ద జీడీపీ రూ.48.63 లక్షల కోట్లుగా అంచనా వేయడం జరిగింది. ఇది 2024, 25 ఆర్థిక సంవత్సరం రెండవ త్రైమాసికంలో రూ.44.94 లక్షల కోట్లుగా ఉంది. ఇది 8.2 శాతం వృద్ధి రేటును నమోదు చేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరం రెండవ త్రైమాసికంలో నామమాత్రపు జీడీపీ, ప్రస్తుత ధరల వద్ద జీడీపీ రూ.85.25 లక్షల కోట్లుగా అంచనా వేశారు. ఇది 2024-25 ఆర్థిక సంవత్సరం రెండవ త్రైమాసికంలో రూ.78.40 లక్షల కోట్లుగా ఉంది. ఇది 8.7 శాతం వృద్ధి రేటును చూపుతోంది.ముఖ్యంగా ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్స్ ఎకోసిస్టమ్.. వేగంగా విస్తరిస్తుండడం ఈ వృద్ధికి అద్దం పడుతోంది. పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ సర్వీసుల, అల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్ వంటి పెట్టుబడులు గత 10 ఏళ్లలో 31.24% తో పెరుగుతున్నాయి. 2015లో ఈ పెట్టుబడులు రూ. 1.54 లక్షల కోట్లు ఉండగా.. 2025లో పరాయ పెట్టుబడులు: రూ. 23.43 లక్షల కోట్లకు చేరాయి.ప్రపంచవ్యాప్తంగా మారుతున్న ఆర్థిక పరిస్థితులు, అనిశ్చితులు పెట్టుబడిదారులను సంప్రదాయ ఈక్విటీ, డెట్ మార్కెట్ల నుంచి బయటకు నడిపించి, కొత్త ప్రత్యామ్నాయాల వైపు మళ్లించాయి. స్టార్టప్ వ్యవస్థాపకులు, ప్రొఫెషనల్స్, యువ పెట్టుబడిదారులు మాత్రమే కాదు... చిన్న పట్టణాల్లో కూడా ఆల్టర్నేటివ్ పెట్టుబడులపై ఆసక్తి భారీగా పెరుగుతోంది. పరిశ్రమ పదేళ్లలో 1.27 లక్ష కోట్ల నుంచి 8.37 లక్షల కోట్లుకు ఎగబాకింది అంటే.. ఎంత డెవలప్‌మెంట్ ఉందో అర్థం చేసుకోవచ్చు. పరిశ్రమ రంగం కూడా 49.23% తో అత్యంత వేగంగా విస్తరణ చెందింది.ఇక దేశంలో గృహ వినియోగ వంట గ్యాస్ వినియోగం కొత్త రికార్డులు నమోదు చేస్తోంది. పెట్రోలియం ప్లానింగ్ అండ్ అనాలిసిస్ సెల్ తాజా గణాంకాల ప్రకారం 2024-25లో దేశవ్యాప్తంగా గృహ గ్యాస్ వినియోగం 31.3 మిలియన్ మెట్రిక్ టన్నులకు చేరింది. ఇది కేవలం డిమాండ్ పెరుగుదలకే సంకేతం కాదు... సురక్షిత, శుభ్రమైన వంట ఇంధనాల వైపు దేశం మొగ్గు చూపుతున్నట్టు కూడా సూచిస్తోంది.గత ఇరవై ఏళ్లలో దేశంలో గ్యాస్ వినియోగం దాదాపు మూడు రెట్లు పెరిగింది. 2004-05లో 10.2 ఎంఎంటీ, 2013-14లో 16.3 ఉండగా.. పెద్ద ఎత్తున పెరుగుదల గత దశాబ్దంలోనే నమోదైంది. 2024-25 నాటికి వినియోగం 31.3 MMTకి చేరి... 2013-14తో పోలిస్తే రెండింతలకు పైగా పెరిగింది. మోదీ ప్రభుత్వం గత కొన్నేళ్లుగా గ్యాస్ కనెక్షన్ల విస్తరణపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ముఖ్యంగా ఉజ్వల పథకం ద్వారా గ్రామీణ, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు పెద్ద సంఖ్యలో వంట గ్యాస్‌ను వినియోగించడం ప్రారంభించాయి. అదనంగా దేశంలో గ్యాస్ సరఫరా వ్యవస్థ గణనీయంగా బలోపేతమైంది. రిఫైనరీ సామర్థ్యం పెరగడం, పెద్ద గోదాములు, మెరుగైన పంపిణీ నెట్వర్క్ కారణంగా గ్యాస్ రీఫిల్ అందుబాటు సులభమైంది. ఇటీవలి కాలంలో గ్యాస్ ధరలు తగ్గటం కూడా డిమాండ్‌పై ప్రభావం చూపింది.ఈ నెలలో గృహ ఎల్ పీజీ ధరల్లో మార్పు లేకపోయినా, కమర్షియల్ గ్యాస్ ధరలు మాత్రం తగ్గాయి. మూడీస్ రేటింగ్స్ 2025 లో 7 శాతం జిడిపి విస్తరణ, వచ్చే ఏడాది 6.4 శాతంతో భారతదేశం అభివృద్ధి చెందుతున్న మార్కెట్లలో ఆసియా పసిఫిక్ ప్రాంతంలో వృద్ధికి సూచిక అని తెలిపింది. ప్రపంచ అనిశ్చితి మధ్య భారతదేశం దేశీయ వృద్ధి దాని ఆర్థిక స్థితిస్థాపకతను బలపరుస్తాయని మూడీస్ తెలిపింది. సెప్టెంబర్ చివరలో GST రేటు తగ్గింపు కారణంగా పండుగ అమ్మకాలు జోరుగా సాగడంతో, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండవ త్రైమాసికంలో భారతదేశ జీడీపీ వృద్ధి 7.5 శాతం, అంతకంటే ఎక్కువకు చేరుకుంటుందని SBI పరిశోధన నివేదిక అంచనా వేసింది.ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో జిడిపి వృద్ధికి ప్రధానంగా వ్యవసాయ రంగం మంచి ప్రదర్శన, వాణిజ్యం, హోటల్, ఆర్థిక, రియల్ ఎస్టేట్ వంటి సేవలు కూడా దోహదపడ్డాయి. దేశ జీడీపీ లో గతంలో అత్యధిక వృద్ధి రేటు 2024 జనవరిమార్చిలో 8.4 శాతంగా నమోదైంది. ఏప్రిల్‌జూన్ కాలంలో చైనా జిడిపి వృద్ధి 5.2 శాతంగా ఉండటంతో భారతదేశం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతోంది. జాతీయ గణాంకాల కార్యాలయం విడుదల చేసిన గణాంకాల ప్రకారం, వ్యవసాయ రంగం 3.7 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఇది 2024-25 ఏప్రిల్‌జూన్ కాలంలో 1.5 శాతం నుండి పెరిగింది.విడుదల చేసిన డేటా ప్రకారం, ఒక నిర్దిష్ట కాలంలో ఒక దేశ భౌగోళిక సరిహద్దులలో ఉత్పత్తి చేసిన తుది వస్తువులు, సేవల మొత్తం విలువను జీడీపీ సూచిస్తుంది. జాతీయ గణాంక కార్యాలయం (NSO) డేటా ప్రకారం, 2025-26 ఆర్థిక సంవత్సరం మొత్తం దేశ జీడీపీ 8.2 శాతం చొప్పున పెరిగింది.


## సీఎం లోకేష్.. టాక్ ఆఫ్ హస్తిన

విషయాల్లోనూ లోకేశ్ ను చురుగ్గా పాల్గొనేలా చేస్తున్నారు. మంత్రిగా ఉన్న లోకేశ్ ను తన వెంట తిప్పుకుంటున్నారు. పుట్టపర్తికి ప్రధాని వచ్చినా, రాష్ట్రపతి వచ్చినా, ఉప రాష్ట్రపతి వచ్చినా చంద్రబాబుతో పాటు లోకేశ్ కూడా హాజరవ్వడాన్ని పార్టీ నేతలు, కార్యకర్తలు ఈ ధోరణితోనే చూస్తున్నారు. నారా లోకేశ్ కూడా ఏ స్థాయిలో తొందరపడటం లేదు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రిగా పవన్ కల్యాణ్ తర్వాత తాను అంటూ బయటకు కనిపించే ప్రయత్నం చేస్తున్నారు. మరొకవైపు రాష్ట్రంలో ఇప్పటికే పట్టు పెంచుకున్న నారా లోకేశ్ ఢిల్లీ స్థాయిలో పరిచయాలు, పట్టు పెంచుకునే కార్యక్రమంలో భాగంగా వరసగా హస్తిన చుట్టూ తిరుగుతున్నారు. ఇక విదేశాల్లో కూడా ఆయన పర్యటిస్తూ నాటి చంద్రబాబు తరహాలోనే పార్టీని బలోపేతం చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు కనిపిస్తుంది. ఇప్పటికిప్పుడు లోకేశ్ ను అత్యున్నత పదవిలో చూడకపోయినా ఆయన ట్రైనింగ్ పూర్తయి సిద్ధంగా ఉన్నారని, ఏ సమయంలోనైనా కీలక పదవి చేపట్టే అవకాశముందని పార్టీ నేతలే అంగీకరిస్తున్నారు. అందుకే లోకేశ్ వద్దకు నాయకులు క్యూ కడుతున్నారు. గత ఎన్నికలకు ముందు నుంచే ఈ రకమైన అభిప్రాయం వినిపించినా రెండేళ్లకు అది రెట్టింపయిందని అంటున్నారు.

## రేవంత్ అధికార దుర్వినియోగం చేస్తున్నారు

సూచిస్తామని ఈసీ అధికారులు మాకు చెప్పారు. కానీ సీఎం మాట్లాడిన మాటలు కచ్చితంగా మొరల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘించే విధంగా ఉన్నాయని అన్నారు. రేవంత్ రెడ్డి మాట్లాడిన మాటల కాపీలను మేము ఈసీకి అందజేశామని.. గతంలో సర్పంచ్ ఎన్నికల సమయంలో రాష్ట్రం మొత్తం ఎలక్షన్ కోడ్ ఉండేదన్నారు. కానీ ఆ తర్వాత మున్సిపాలిటీ పరిధిలో కోడ్ లేకుండా మినహాయింపు తెచ్చారని ఈ లూప్ హోల్స్ అడ్వంటేజ్ గా చేసుకొని సీఎం ప్రయోజనం పొందాలని చూస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ ధనంతో నిన్న స్కూల్ పిల్లలను నింపి మీటింగ్ పెట్టారు.రాష్ట్రంలో ఫెయిర్ అండ్ ఫ్రీ గా ఎన్నికలు జరగాలంటే వెంటనే సీఎం టూర్ ని నిలిపివేయాల్సిందేనన్నారు. కేంద్ర ఎన్నికల సంఘాన్ని కూడా ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని కోరుతామని కవిత ప్రకటించారు. అదే విధంగా చాలా ఏరియాల్లో యాక్షన్ నిర్వహిస్తూ సర్పంచ్ పదవిని సొంతం చేసుకుంటున్నారు. ఇది ఏమాత్రం సరికాదు. గద్వాల్ లో కొన్ని ఊర్లలో ఆగడాలను కూడా ఈసీ దృష్టికి తీసుకెళ్లాం. నల్గొండలో బీసీ బిడ్డను నిర్బంధించి గెలవాలని చేసిన ప్రయత్నాన్ని కూడా చెప్పామన్నారు. సీఎం మాత్రం తన అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. ఇప్పుడు మేము ఇచ్చిన ప్రూఫ్స్‌తో కచ్చితంగా ఈసీ అధికారులు చర్య తీసుకోవాల్సిన అవసరముందన్నారు. కాంగ్రెస్ పార్టీ మీటింగ్ పెట్టుకుంటే సరే. కానీ ప్రజాధనంతో ఇలా చేయటం సరికాదన్నారు. ఎన్నికల కోడ్ రాజకీయ పార్టీలు ఎలా ఉల్లంఘిస్తాయన్న దానిపై నేను చాలా స్టడీ చేశానని.. ఈ అంశాన్ని మిగతా ప్రతిపక్షాలు కూడా సీరియస్ గా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఓ పక్క ఓటు చోరీ గురించి కేంద్ర ఎన్నికల సంఘం పట్టించుకోవటం లేదని రాహుల్ గాంధీ గారు అంటారు. కానీ ఇక్కడ కూడా సీఎం కోడ్ ఉల్లంఘన చేస్తున్నారు. దాన్ని రాష్ట్ర ఎన్నికల సంఘం సీరియస్ గా తీసుకోవాలని స్పష్టం చేశారు. మేము ఇచ్చిన ఫిర్యాదు పై రేపు కూడా స్పందించకపోతే మళ్లీ, మళ్లీ రిప్రజెంటేషన్ ఇస్తామని.. అదే విధంగా మీడియా ద్వారా ప్రజలకు ఈ అంశాన్ని జాగృతం చేసే ప్రయత్నం చేస్తూనే ఉంటామని ప్రకటించారు.

# జీవితం అంటే.. బ్రతకడమేనా..!?




Dr. హరి హర నాద రాజు
శంబాలా 360 సోలుషన్స్
9177 445 591
www.shambala360solutions.com


జయభేరి, హైదరాబాద్ :

**జీవితంలో నిజంగా మనం జీవిస్తున్నామా? ఇది అంతుచిక్కని ప్రశ్న. వ్యధలతో, బాధలతో, అసంతృప్తులతో, నిరాశా నిస్పృహలతో జీవితమంతా గడిచిపోయింది.**

వెనక్కి తిరిగి చూసుకుంటే చివరకు మిగిలేది ఏమిటి? అనంతమైన పశ్చాత్తాపం కళ్ల ముందు సాకారమవుతుంది. దేవుడిచ్చిన బహుమానమైన ఈ జీవితం ఇలా నిష్ఫలంగా ముగిసిపోతుందనే చింతన చరమాంకంలో వేధిస్తుంది. అందుకే ముందే మేల్కోవాలి. జీవితాన్ని సార్థకం చేసుకోవాలి. శాశ్వతం కాని దేహం మీద మమత్వాన్ని వదిలిపెట్టి శాశ్వతుడైన పరబ్రహ్మను భజించమని జగద్గురువు ఆదిశంకరులు మహోపదేశం చేశారు. అవిద్య, రాగద్వేషాలు, జీవితంపట్ల నిర్లక్ష్యం, మానవీయత లేకపోవడం, జడత్వం వీటిని పంచ మహాదుఃఖాలుగా పతంజలి మహర్షి అభివర్ణించారు. జీవితమంటే చావు వచ్చేంతవరకు కొనసాగించే పయనం ఎంత మాత్రమూ కాదు. 'మృత్యువు నిన్ను నీడలా ఎల్లప్పుడూ అనుసరిస్తుంది. అది నిన్ను అక్కున చేర్చుకోకముందే, దాన్ని జయించాలి. మరణించే నువ్వు జీవించాలి' అని ఉపనిషత్తులు ప్రబోధించాయి. అన్ని దుఃఖాలకంటే మరణ దుఃఖం అతి భయంకరమైనది. మరణ దుఃఖాన్ని, మృత్యుభీతిని అధిగమించడం ఎలా? ...పరమాత్ముడికి ప్రియమైన రీతిలో మనం జీవన సంవిధానాన్ని అవలంబించడం ద్వారా మృత్యువునైనా ప్రియమైన మిత్రుడిగా మార్చుకోవచ్చు. నిష్కామ భావంతో కర్మాచరణ చేస్తూ, ధర్మ పథంలో పయనించడం ద్వారా, చింతనామృతాన్ని నిరంతరం ఆస్వాదించడం ద్వారా జీవన మార్గాన్ని సుగమం చేసుకోవచ్చు. మాననీయమైన మానవీయ విలువలతో కూడిన జీవితాన్ని గడిపినవారే చిరంజీవులు. అలాంటివారే అసలైన కీర్తిశేషులు!

మనిషి తన జీవితాన్ని ధర్మానికి అనుగుణంగా మలచుకుంటే మరణ భయం నుంచి బయట పడవచ్చు. తన కోసం, సమాజం కోసం, దైవం కోసం ఎలాంటి కర్తవ్యాల్ని ఆచరించి తరించాలో తెలుసుకుని మసలుకోవచ్చు. తనను తాను తెలుసుకోలేనివాడు సామాన్యుడు. ఆ జ్ఞానాన్ని పొందినవాడు మాన్యుడు. సమస్త ప్రాణులపట్ల అనురక్తిని ప్రదర్శిస్తూ, సర్వభూతాల పట్ల మిత్రత్వాన్ని కలిగి ఉంటూ, సకల జనుల పట్ల దయాభావాన్ని ప్రకటిస్తూ, అహంకార రహితులై, సుఖ దుఃఖాల్లో సమభావం కలవారే తనకు ప్రియమైనవారని భగవద్గీతలో శ్రీకృష్ణుడు స్పష్టం చేశాడు. క్షమ, నిగ్రహం, ప్రేమ, సత్యసంధత, రుజువర్తన, వినయం, భూతదయ, సేవాతత్పరత ఈ అష్టసూత్రాల్ని జీవితానికి అనుసంధానించుకోవడం ద్వారా లోకాన్ని వశం చేసుకోవచ్చని భాగవతం ప్రతిపాదించింది. జీవన రథానికి ఇంధనం ఆత్మవిశ్వాసం. 'బతుకు అనేది మెతుకుల కోసం పోరాటం కాదు. బతుకు గతుకుల మయం కాకూడదు. బతుకు అతుకుల బొంతగా కనిపించకూడదు. ఈ బతుకు దయగల భగవంతుడిచ్చిన అపురూప అవకాశం. దాన్ని అందిపుచ్చుకో. చరితార్థుడిగా మిగిలిపో!' ఓ సూఫీ కవిత వెల్లడించిన జీవన సత్యమిది. జీవితం పట్ల భయం ఉండకూడదు. భక్తి ఉండాలి. శేష ప్రశ్నగా మిగిలే భవిష్యత్ జీవితంపట్ల వర్తమానంలో ఆందోళన అనవసరం. ధీరచిత్తంతో ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి సదా సమాయత్తంగా ఉండాలి. ఇదే ఉదాత్త చరితుల ఉత్తమలక్షణం. ధైర్యం, నిర్భయత్వమనేవి ఆత్మజ్ఞానంతోనే సిద్ధిస్తాయి. సర్వశుభంకరమైన ధర్మకర్మల్ని ఆచరిస్తూ కర్మసాక్షి అయిన భగవంతుడు మనల్ని గమనిస్తున్నాడనే ఎరుకను కలిగిఉండాలి. తరతరాలుగా అనుసరిస్తున్న ఆధ్యాత్మిక జీవన సంవిధానాన్ని పాటించాలి. నైతికశీల సంపత్తితో వేదవిహితమైన విధివిధానాలతో జీవన సంగీతపు మధురిమల్ని ఆస్వాదించాలి. జీవితనౌకను వెలుగు తీరానికి చేర్చాలంటే ముందు అంతర్వీక్షణతో మనలో కాంతిని నింపుకోవాలి. హృదయాలయంలో జ్ఞానజ్యోతుల్ని ప్రజ్వలింపజేసుకోవాలి. శంభాల తల్లి ద్వారా జ్ఞానం సంపాదించుకోవచ్చు దైవ శక్తి దేశభక్తి సనాతన సంస్కృతి.

# బిఆర్ఎస్ పార్టీలోకి చేరికలు



జయభేరి, నల్గొండ జిల్లా :

దేవరకొండ పట్టణంలోనీ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో డిండి మండలం కందుకూరు గ్రామానికి చెందినశ్రీకాంత్ తోపాటు 50 మంది యువకులు భారత రాష్ట్రసమితి (బీఆర్ఎస్) పార్టీలో చేరారు. బీఆర్ఎస్ లో చేరిన నాయకులకు గులాబీ కండువాలను కప్పి మాజీ శాసనసభ్యులు రవీంద్ర కుమార్ తమ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోసకారి కాంగ్రెస్ ప్రభుత్వానికి ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలి అని ఆయన అన్నారు.అసమర్ధ కాంగ్రెస్ పాలనలో సబ్బండ వర్గాలకు అన్యాయం జరుగుతుందని ఆయన తెలిపారు.కాంగ్రెస్ పాలన పట్ల ప్రజలు విసుగు చెందారు అని ఆయన తెలిపారు. ఆరు గ్యారంటీల మోసాన్ని, 420హామీలను ప్రజలకు వివరించాలి అని ఆయన పిలుపు నిచ్చారు.ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలం అయింది అని ఆయన అన్నారు.వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయం అని ఆయన తెలిపారు.ప్రతీ కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటా అని ఆయన తెలిపారు.తెలంగాణలో రైతుల కన్నీటి గాధ అని,కాంగ్రెస్ ప్రభుత్వం పై తిరగబడుతున్న తెలంగాణ ప్రజలు అని ఆయన గుర్తు చేశారు.ఎన్నికల మీద ఉన్న శ్రద్ధ రైతుల మీద లేదా రేవంత్ ప్రభుత్వానికి లేదు అని ఆయన అన్నారు. ఇది ప్రజా ప్రభుత్వం కాదు, పనికిరాని ప్రభుత్వం అని ఆయన పేర్కొనారు.కాంగ్రెస్ రెండు సంవత్సరాల పాలనలో తెలంగాణలో సబ్బండవర్గాలు ఆందోళన బాట పట్టాయి అని ఆయన తెలిపారు.స్వరాష్ట్రం ఏర్పడిన అనంతరం తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో పదేండ్ల పాటు అభివృద్ధి మార్గంలో పరుగులు తీసిన తెలంగాణ అని ఆయన గుర్తు చేశారు.నేడు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వల్ల సంక్షోభంలో కూరుకు పోయింది అని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రాజీనేని వెంకటేశ్వర్ రావు, మాజీ ఎంపీటీసీ ముఖ్య సలహాదారులు ఉప్పుగంటి ప్రశాంత్ రావు, మాజీ జెడ్పిటిసి రాఘవ చారి, పెద్దయ్య, ప్రవీణ్,తదితరులు ఉన్నారు.

# మొదటి వారంలో సైబర్ సారధి




జయభేరి, మెడిపల్లి :

తెలంగాణ రాష్ట్ర డీజీపీ ఉత్తర్వుల మేరకు, బుధవారం ఉదయం 11:30 గంటలకు, మెడిపల్లి పోలీసులు శ్రీ చైతన్య జూనియర్ గర్ల్స్ కళాశాల, పీర్జాదిగూడలో సుమారు 800 మంది విద్యార్థినులకు సైబర్ నేరాల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆరు వారాల కార్యక్రమంలో మొదటి వారంలో 'సైబర్ సారధి' అనే థీమ్‌తో ఈ కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమంలో విద్యార్థినులకు ఆన్‌లైన్ మోసాలు, సైబర్ భద్రత, మోసాలు జరిగిన వెంటనే తీసుకోవలసిన చర్యలపై అవగాహన కల్పించబడింది.

- **1930 సైబర్ హెల్ప్‌లైన్:** ఆన్‌లైన్ ఆర్థిక మోసాలు జరిగితే వెంటనే 1930 కు కాల్ చేయడం అత్యంత అవసరం. వెంటనే ఇచ్చే సమాచారం ద్వారా పోలీసులు మరియు బ్యాంకులు మోసపోయిన మొత్తం ఫ్రీజ్ చేసే అవకాశం ఉంటుంది.
- **గోల్డెన్ అవర్ రిపోర్టింగ్:** సైబర్ మోసం జరిగిన మొదటి ఒక గంట అత్యంత కీలకం. ఈ సమయంలో రిపోర్ట్ చేస్తే డబ్బు తిరిగి పొందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.
- **Put on Hold అవకాశం:** వెంటనే 1930 లేదా సైబర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేస్తే, సంబంధిత ఖాతాపై put on hold అవకాశం ఉంటుంది, తద్వారా మోసగాళ్లు డబ్బు ఉపసంహరణ చేయకుండా తక్షణమే అడ్డుకుంటారు.
- **రోజు వచ్చే కాల్స్ సంఖ్య:** ప్రతిరోజూ యూపీఐ, సోషల్ మీడియా, ఉద్యోగాలు, పెట్టుబడులు, ఓటీపీ, కస్టమర్ కేర్ మోసాలు వంటి అనేక ఫిర్యాదులు పెద్ద ఎత్తున 1930 హెల్ప్‌లైన్‌కు వస్తున్నాయి.
- **రోజువారీ నష్టాలు:** ప్రజలు ప్రతిరోజూ కోట్ల రూపాయల మేరకు సైబర్ మోసాలకు గురవుతున్నారని, అవగాహనతో తక్షణ ఫిర్యాదు చేస్తే ఈ నష్టాలను తగ్గించవచ్చని వివరించారు.
- **AI చాట్‌బాట్ ద్వారా వేగవంతమైన రిపోర్టింగ్:** "సైబర్ సారధి"లో భాగంగా, త్వరితగతిన మార్గదర్శకత్వం అందించడానికి, ఫిర్యాదులను వాయిదా లేకుండా నమోదు చేయడానికి, గోల్డెన్ అవర్ రిపోర్టింగ్ పెంచడానికి తెలంగాణ పోలీసులు AI ఆధారిత సైబర్ సహాయక చాట్‌బాట్ ను ప్రవేశపెట్టారు. ఇది రిపోర్టింగ్ సమయాన్ని గణనీయంగా తగ్గించగలదని వివరించారు.

చివరగా, మెడిపల్లి పోలీసులు, సైబర్ క్రైమ్ పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థినులను ఆన్‌లైన్‌లో జాగ్రత్తగా ఉండాలని, అనుమానాస్పదమైన సైబర్ కార్యకలాపాలను వెంటనే రిపోర్ట్ చేయాలని, మరియు తమ కుటుంబ సభ్యులు-స్నేహితులకు కూడా ఇదే అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.

# అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం




జయభేరి, మేడిపల్లి :

అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం పురస్కరించుకొని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి మండలం పీర్జాది గూడ కార్పొరేషన్ పరిధిలోని 16వ డివిజన్ గణేష్ నగర్ చైల్డ్ గైడెన్స్ సెంటర్ (సిజిసి) ప్రిన్సిపాల్ డీ రజిని ఆధ్వర్యంలో గణేష్ నగర్ నుండి మేడిపల్లి పోలీస్ స్టేషన్ మీదుగా డిజేబుల్డ్ ఇంటర్నేషనల్ డే పురస్కరించుకొని అవేర్నెస్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ మేరకు ప్రిన్సిపాల్ రజని మాట్లాడుతూ.. అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం పురస్కరించుకొని చైల్డ్ గైడెన్స్ సెంటర్లో ప్రతి సంవత్సరం వారోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని, ఈసారి డిజేబుల్డ్ డే అవేర్నెస్ కోసం గణేష్ నగర్ నుండి మేడిపల్లి పోలీస్ స్టేషన్ మీదుగా మా విద్యార్థినీ విద్యార్థులు స్టాప్ తో కలిసి అవేర్నెస్ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మేడిపల్లి పోలీసు వారు మా విద్యార్థిని విద్యార్థులను అవేర్నెస్ కార్యక్రమాన్ని ప్రోత్సహిస్తూ స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సత్యవాణి, సంస్థ ప్రధాన కార్యదర్శి జాయినీ రోజ్ కుమారి హాజరై కారిక్రమాన్ని ప్రారంభించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ.. గత 52 సంవత్సరాలుగా సిజిసి అనే విత్తనం పెట్టి భారీ వృక్షంగా తయారుచేసి, సుమారుగా ఈరోజు 170 మంది మానసిక అంగవైకల్యం కలిగిన విద్యార్థిని విద్యార్థులకు స్పెషల్ ఎడ్యుకేషన్ ఇచ్చి 10 ప్లస్ 2 ఇంటర్ వరకు చదివించి ప్రభుత్వ ఉద్యోగుల కోసం స్పెషల్ ఎడ్యుకేషన్ కాలేజ్ ఏర్పాటు చేసి వాళ్ళ జీవితాలను తీర్చిదిద్దడం జరుగుతుందని తెలియజేశారు. అదేవిధంగా రాబోయే మూడు రోజులు వారోత్సవాలలో భాగంగా స్టాల్స్ ఏర్పాటు చేసి అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం పురస్కరించుకొని అవేర్నెస్ కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి మేడిపల్లి పోలీసు వారితో పాటు పలువురు రాజకీయ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, చుట్టుపక్కల ఉన్నటువంటి స్కూల్ విద్యార్థిని విద్యార్థులు, స్పెషల్ ఎడ్యుకేషన్ విద్యార్థిని విద్యార్థులు తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిజిసి సెంటర్ విద్యార్థిని విద్యార్థులు వారి తల్లిదండ్రులు, స్టాప్, సిబ్బంది తదితరులు హాజరయ్యారు.

# అభివృద్ధి పనులకు శంకుస్థాపన

- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



జయభేరి, మల్లాపూర్ :

మల్లాపూర్ డివిజన్ పరిధిలో ఒక కోటి 31 లక్షల రూపాయలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. మల్లాపూర్ డివిజన్ పరిధిలో వెంకటరమణ కాలనీలోని పార్కులో 81 లక్షల రూపాయలతో అభివృద్ధి పనులకు బ్రహ్మపురి కాలనీ, వెంకటరమణ కాలనీలో సుమారు 50 లక్షల రూపాయలతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన గౌరవ ఎమ్మెల్యే శ్రీ బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి కాప్రా సర్కిల్ డిఈఈ రూపా, ఏఈ శ్రవంతి, కాలనీ వాసులు రాపోలు సతీష్, ఉపేందర్ రావు, శ్యామ్ సుందర్ రెడ్డి, హరీష్ రెడ్డి, వీరేశ్, స్థానిక నాయకులు తిగుళ్ల శ్రీనివాస్, కుంటి కృష్ణ, బోదసు లక్ష్మీనారాయణ, తండా వాసుగౌడ్, నాగరం బాబు, అల్లాడి కృష్ణ యాదవ్, భూమండ్ల శ్రీశైలం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.




## బీఆర్ఎస్ పార్టీ నుంచి మాజీ సర్పంచ్ సస్పెండ్

జయభేరి, తుర్కపల్లి, డిసెంబర్ 03:

తుర్కపల్లి మండలం ఇబ్రహీంపూర్ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ కార్యకలాపాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారని గ్రామ మాజీ సర్పంచ్ ఎడ్ల నీరజ అమరేందర్ రెడ్డిని బీఆర్ఎస్ పార్టీ నుండి సస్పెండ్ చేస్తున్నట్లు గ్రామ శాఖ అధ్యక్షుడు బూరుగు మహేందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో బీఆర్ఎస్ పార్టీలో గెలుపొంది సర్పంచిగా ఉన్న వ్యక్తులు ఇప్పుడు జరగబోయే సర్పంచ్ ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్ కాకుండా కాంగ్రెస్ పార్టీకి ప్రచారం చేస్తున్నారని మండల పార్టీ అధ్యక్షుడు దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని ఈ క్రమంలో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ గతంలో ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్రెడ్డి ఓటమికి కారణమై నేడు అదే ధోరణిలో కాంగ్రెస్ అభ్యర్థికి ప్రచారం చేస్తున్నారని, గ్రామ శాఖ కార్యవర్గంలో చర్చించి ఆయనను ఆరు సంవత్సరాలు పార్టీ నుండి బహిష్కరిస్తున్నట్లు మధుసూదన్ రెడ్డి తెలిపారు. పార్టీకి వ్యతిరేకంగా ఎవరు పనిచేసిన అధిష్టానం తప్పక చర్యలు తీసుకుంటుందని అన్నారు.

## విధి నిర్వహణలో వున్న ఎస్సై మృతి

జయభేరి, మేడ్చల్:

ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్లో విషాదంనెలకొంది. విధి నిర్వహణ లో వున్న ఎస్సై సంజయ్ సావంత్ (58) రాత్రి గుండె పోటుతో మృతి చెందారు .1989 బ్యాచ్ కి చెందిన సంజయ్ సావంత్ (58) ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ విధులు నిర్వహిస్తున్నారు. మంగళవారం రాత్రి రాత్రి విధులు నిర్వహిస్తు రెస్ట్ రూమ్ లో కి వెళ్లి కూర్చిలోని కూర్చొని మృతి చెందిరు. రోజు విధులు నిర్వహిస్తున్న ఎస్సై హటాత్తుగా మృతి చెందడంతో పోలీస్ స్టేషన్ లో విషాదం నెలకొంది.

## ఖమ్మం విజయనగరంలో చైన్ స్నాచింగ్

జయభేరి, ఖమ్మం :

నగరంలోని 56వ డివిజన్ విజయనగర్ కాలనీలో చైన్స్ స్నాచింగ్ జరిగింది. మహిళ మెడలో సుమారు 10 గ్రాముల బరువున్న పుస్తెలతాడును దుండగుడు బైక్ పై వచ్చి లాక్కు వెళ్లాడు. మంగళవారం సాయంత్రం నాలుగున్నర గంటల సమయంలో ఘటన జరిగింది. బాధితురాలు నాగజ్యోతి టూ టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది.

## వెల్దుర్తి తహశీల్దార్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు

జయభేరి, మెదక్ :

వెల్దుర్తి తహశీల్దార్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు జరిపింది. రైతు భూమి సర్వే చేయడానికి సర్వేయర్ శ్రీనివాస్ లంచం డిమాండ్ చేసాడు. దాంతో బాధిత రైతు ఏసీబీని ఆశ్రయించాడు. రైతు నుంచి 20 వేల రూపాయలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. కార్యాలయంలో సాయంత్రం వరకు సోదాలు కొనసాగాయి.



## గ్రామ అభివృద్ధికి కృషి చేస్తా..

- దుద్దనపల్లి సర్పంచ్ బరిలో సాహితి - రాకేష్ పిట్టల

జయభేరి, సైదాపూర్ :

సైదాపూర్ మండలంలోని దుద్దనపల్లి గ్రామ పంచాయితీ ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సాహితీ రాకేష్ పిట్టలను ప్రజల ఆశీర్వాదం కోరుతున్నారు. గ్రామ అభివృద్ధి, పారదర్శకత పాలన, ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యమని వారు తెలిపారు. గ్రామస్తుల నమ్మకాన్ని గెలుచుకొని గ్రామ అభివృద్ధికి కృషి చేస్తామని వారు హామీ ఇస్తున్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేకపోయినా కష్టకాలంలో పార్టీలో 2017 నుండి 2022 వరకు సైదాపూర్ మండలం యూత్ కాంగ్రెస్ అధ్యక్షునిగా, అదేవిధంగా 2022 2024 వరకు హుస్నాబాద్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులుగా పని చేసిన అనుభవం ఉంది. దుద్దెనపల్లి గ్రామంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయడం, సైదాపూర్ మండల పరిధిలో పలు గ్రామాలలో కూడా ఓపెన్ జిమ్లు తమ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం స్థానిక ఎన్నికల్లో దుద్దెనపల్లి గ్రామ సర్పంచి స్థానం బీసీ మహిళ రావడంతో తన భార్య సాహితి రాకేష్‌పిట్టల సర్పంచి స్థానం కోసం పోటీ చేస్తున్నారు. గ్రామంలో గెలిచిన రెండు సంవత్సరాల లోపు గ్రంథాలయాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇస్తున్నారు. దుద్దనపల్లి యువత, మహిళలు, గ్రామ పెద్దలు ఆశీర్వదించి గెలిపిస్తే ముందు ముందు ఇంకా అభివృద్ధి పనులు చేస్తామని హామీ ఇస్తున్నారు.



ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి సనాతన ధర్మాన్ని అవమానిస్తూ హిందువుల మనోభావాలను దెబ్బతీస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బుధవారం సరూర్నగర్ పోలీస్ స్టేషన్లో కంప్లైంట్ ఇచ్చాం. హిందూ భావాలను కించపరిచే మాటలకు రాజకీయ రక్షణ ఉండదు.. తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరాం.

జయభేరి, హైదరాబాద్

## ధర్నాలో పాల్గొన్న మేడిపల్లి మండల జర్నలిస్ట్ నేతలు

- ధర్నాకు తరలిన మేడిపల్లి ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ జర్నలిస్టులు



జయభేరి, మేడిపల్లి :

మాసబ్ ట్యాంకులోని సమాచార కార్యాలయం వద్ద బుధవారం జరిగిన జర్నలిస్టుల ధర్నాకు మేడిపల్లి మండల ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ జర్నలిస్టులు తరలివెళ్లారు. క్లబ్ ప్రధాన కార్యదర్శి వడ్డెమాను సుందర్ నేతృత్వంలో పలువురు జర్నలిస్టులు ధర్నాలో పాల్గొ ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యల పట్ల అనుసరిస్తున్న వైఖరిని తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వడ్డెమాను సుందర్ మాట్లాడుతూ.. దీర్ఘకాలంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను వెంటనే పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కొ శాధికారి మరాటి మల్లేశ్, ముఖ్యసలహాదారు కల్మూరి ఎల్లయ్య, సీనియర్ నేత ననుబోతు రాము యాదవ్, ఉపాధ్యక్షులుచింత రమేశ్, సంయుక్త కార్యద చిన్నం మధు తదితరులు పాల్గొన్నారు.

## తిరస్కరించిన నామినేషన్ల పై అప్పీళ్లు




జయభేరి, నల్గొండ :

గ్రామపంచాయతీ ఎన్నికలలో భాగంగా నల్గొండ రెవెన్యూ డివిజన్ పరిధిలో రిటర్నింగ్ అధికారులు తిరస్కరించిన నామినేషన్ల పై వచ్చిన అప్పీళ్లను జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో పరిశీలించారు. నల్గొండ డివిజన్ పరిధిలోని 9 మండలాలలో రిటర్నింగ్ అధికారులు తిరస్కరించిన నామినేషన్ల పై 19 అప్పీళ్లు రాగా, అప్పిళ్లపై నిబంధనల ప్రకారం ఆర్ ఓల సమక్షంలో పరిశీలించి ఆర్డిఓ రూపొందించిన జాబితాను, తీసుకోన్న నిర్ణయాలను ఆమె పరిశీలించారు. కాగా వచ్చిన 19 అప్పీళ్లలో 15 తిరస్కరణకు గురికాగా, 4 అప్పిళ్లు అంగీకరించినట్లు ఆర్ డిఓ అశోక్ రెడ్డి జిల్లా కలెక్టర్ కు వివరించారు. కాగా చండూరు డివిజన్ కు సంబంధించి నామినేషన్ల పై 3 అప్పీళ్లు రాగా, రెండు తిరస్కరణ అయ్యాయని, ఒకటి అంగీకరించడం జరిగిందని చండూరు ఆర్డీవో శ్రీదేవి తెలిపారు.

## తీరం దాటిన తుఫాను

జయభేరి, నెల్లూరు:

తుఫాన్ బలహీనపడి తీరం దాటిందని మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డి అన్నారు. మరొక 48 గంటల పాటుగా వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సోమశిల, కండలేరు జలాశయాలు కూడా పూర్తిగా నిండిపోయాయని చెప్పారు. చెరువులన్నీ నీటితో నిండిపోయాయని పేర్కొన్నారు. ఒకటవ తేదీన అర్హత కలిగిన ప్రతీఒక్కరికీ పెన్షన్ అందజేస్తున్నామని తెలిపారు.




## ప్రపంచ వికలాంగుల దినోత్సవ శుభాకాంక్షలు

- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**జయభేరి, కాప్రా :**

కాప్రా MRO ఆఫీస్ వద్ద అశోక చైల్డ్ డెవలప్మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో కాప్రా డివిజన్లో నిర్వహించిన ప్రపంచ వికలాంగుల దినోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రపంచ వికలాంగుల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ అంగవైకల్యం మనోస్థైర్యానికి అడ్డు కాదని ఎంతో గొప్ప గొప్ప విజయాలు సాధించి ప్రపంచ స్థాయిలో పేరు సంపాదించుకుని ఎన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించిన వారిలో దివ్యాంగులది ప్రత్యేక, విశిష్టమైన స్థానం అని, మనిషి అనుకోవాలి గాని ఏదైనా సాధించగలను అనే పట్టుదల మనస్తైర్యం ఆత్మవిశ్వాసం వికలాంగులకు ఉంటుందని ఆ యొక్క ఆత్మవిశ్వాసం సాధారణ మనుషులమైన మనకు ఎంతో ఆదర్శప్రాయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ కాప్రా డివిజన్ అధ్యక్షుడు బైరి నవీన్ గౌడ్, కాప్రా పట్టణ వికలాంగులు అధిక సంఖ్యలో తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీలో బారీగా చేరికలు

- స్థానిక ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీకి బిగ్ షాక్
- చింతపల్లి మండలంలో ప్రశాంతపూరి కాంగ్రెస్ పార్టీకి బారీ షాక్
- స్థానిక సంస్థల ఎన్నికలలో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలి
- దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్



**జయభేరి, చింతపల్లి :**

చింతపల్లి మండలం ప్రశాంత్ పూరి తండాకు 100కుంటుబాలు బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్ళలో కేసీఆర్ గారు చేసిన అభివృధి సంక్షేమ పథకాలే మన అభ్యర్థులను గెలిపిస్తాయి అని ఆయన అన్నారు.రెండేళ్ల నుండి కాంగ్రెస్ పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు అని ఆయన తెలిపారు.కాంగ్రెస్ చేసిన మోసాలు, బిఆర్ఎస్ పార్టీ చేసిన సంక్షేమాన్ని గుర్తు చేస్తూ ప్రజల వద్దకు వెళ్లాలి అని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస రాష్ట్ర నాయకులు కేతావత్ బిల్యా నాయక్, కంకణాల వెంకట్ రెడ్డి, జగన్, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పలయ్యకు సన్మానం



**జయభేరి, యాదగిరిగుట్ట, డిసెంబర్ 03:**

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఇటీవల ఎన్నికైన మీసాల ఉప్పలయ్య బుధవారం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా మీసాల ఉప్పలయ్యను కలిసి యాదగిరిగుట్ట మండలానికి చెందిన పలువురు నేతలు గ్యాదపాక బాల్ నర్సయ్య, కందుల మల్లేశం శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు చల్లూరి యాదగిరి, సుంచు బాలయ్య, గుండ్లపల్లి వెంకటేష్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా ఆంజనేయస్వామి ఇరుముడి పూజలు



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ మున్సిపాలిటీ 18 వ వార్డు లో శ్రీ ధ్యానాంజనేయ స్వామి దేవాలయంలో ఆంజనేయ స్వాముల ఇరుముడి కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన 18 వ వార్డు మాజీ కౌన్సిలర్ వి.అంజి గౌడ్.స్వాములకు కాలనీ వాసులకు ఎప్పుడు ఏ అవసరమున నేను ఉన్న అనేదాంట్లో ముందుండే వ్యక్తి అంజి గౌడ్ అని కాలనీవాసులు తెలియజేసినారు.

## మాజీ సీఎం కేసీఆర్ దత్తత గ్రామాల్లో సర్పంచుల ఏకగ్రీవం

**జయభేరి, సిద్దిపేట:**

బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ దత్తత గ్రామాలలో సర్పంచుల ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. బీఆర్ఎస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులను ఎర్రవల్లి, నరసన్నపేట గ్రామ సర్పంచులను గ్రామస్తులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎర్రవల్లి సర్పంచ్ గా కవిత రామ్మోహన్ రెడ్డి, నరసన్నపేట గ్రామ సర్పంచ్ గా బాల నర్సయ్య ఎన్నికయ్యారు.

# ఆంధ్రప్రదేశ్‌లో పేదలకు ప్రభుత్వం తీపికబురు

**జయభేరి, అమరావతి:**




ఆంధ్రప్రదేశ్‌లో పేదలకు ప్రభుత్వం తీపికబురు చెప్పింది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన (గ్రామీణ) పథకం కింద ఇళ్లు కట్టుకోవడానికి దరఖాస్తుల గడువును కేంద్రం మరో రెండు వారాలు పొడిగించింది. ప్రజల నుంచి వస్తున్న వినతులను పరిగణనలోకి తీసుకుని రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. ఈనెల 14వ తేదీ వరకు అర్హులైన వారు తమ దరఖాస్తులను సచివాలయాలు లేదా సర్వే బృందాలకు సమర్పించవచ్చు. ఈ పథకం ద్వారా అర్హత పొందిన వారికి ఉపాధితో పాటు కేంద్ర ప్రభుత్వం నుంచి రూ. 1.59 లక్షల ఆర్థిక సహాయం అందుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లకు కేంద్రం నుంచి రూ.1.5 లక్షలు సాయం అందుతుంది.. దీనికి తోడు రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.లక్ష కలిపి మొత్తం రూ. 2.5 లక్షల సహాయం అందుతుంది.గతంలో గడువు ముగిసినప్పటికీ, చాలా మంది దరఖాస్తు చేసుకోలేకపోయారు. వారి కోరిక మేరకు ఈ గడువు పొడిగించారు. ఇప్పుడు, ఆసక్తి ఉన్నవారు, పథకానికి అర్హత ఉన్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. తమ దరఖాస్తులను దగ్గరలోని సచివాలయాల్లో లేదా ప్రభుత్వ సర్వే బృందాలకు అందజేయాలి.సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించి, లబ్ధిదారుల వివరాలను సరిగ్గా నమోదు చేయాలి. ఈనెల 14వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోని వారు ఎవరైనా ఉంటే, సంబంధిత సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్ ద్వారా దరఖాస్తు చేసుకునే వీలుంది. ఈ పథకం ద్వారా పేదలకు సొంత ఇంటి కల నెరవేరనుంది.ప్రధానమంత్రి ఆవాస్ యోజన (గ్రామీణ) పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు సొంత ఇళ్లు అందించే ప్రక్రియ వేగవంతమైంది. అధికారులు ప్రతి గ్రామంలో సర్వే బృందాలను నియమించి, ఆసక్తిగల వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ప్రతి గ్రామంలోనూ సర్వే బృందాలు చురుగ్గా పనిచేస్తున్నాయి. వారు గ్రామాల్లో తిరుగుతూ, ఇళ్లు కట్టుకోవాలని ఆసక్తి ఉన్నవారి నుంచి దరఖాస్తులు సేకరిస్తున్నారు. సేకరించిన వివరాలను ఆవాస్ ప్లస్ 2024 అనే ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఈ యాప్ ద్వారా లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి, వారి ముఖాన్ని చూసి, వేలిముద్రలు తీసుకుని వివరాలను నమోదు చేస్తున్నారు. దీనివల్ల అర్హులైన వారందరికీ పథకం వర్తింపజేయడం సులభమవుతుంది.గత ప్రభుత్వ హయాంలో ఇళ్లు మంజూరు చేసినా, బిల్లులు చెల్లించకపోవడంతో కొన్ని ఇళ్లు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు ఆ ఇళ్లను పూర్తి చేసే బాధ్యత తీసుకుంది. అలాంటి ఇళ్లకు అదనంగా ఆర్థిక సహాయం కూడా అందిస్తోంది. ఇక సొంత స్థలం ఉండి, ఇళ్లు లేని వారికి కూడా ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరుతోంది. తాజా ప్రక్రియలో అలాంటి వారికి కూడా అవకాశం కల్పించారు. మొదట దరఖాస్తు చేసుకోవడానికి గతనెల 5 వరకు మాత్రమే గడువు ఇచ్చారు. ఆ తర్వాత నవంబర్ 30 వరకు పొడిగించారు. ఇప్పుడు డిసెంబర్ 14 వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంది. సొంత స్థలం ఉన్నవారు, స్థలంతో పాటు తమ వివరాలను ఆ స్థలం ఉన్న చోటే నమోదు చేయించుకోవాల్సి ఉంటుంది. అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేస్తే మరికొంత మంది పేదలకు సొంత ఇళ్లు కట్టుకునే కల నెరవేరుతుంది.



## పుష్కరిణిలో పడి బాలుడు మృతి

**జయభేరి, యాదగిరిగుట్ట, డిసెంబర్ 03:**

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి కొండ కింద గల పుష్కరిణిలో పడి బాలుడు మృతిచెందాడు. బుధవారం యాదగిరిగుట్ట ఆలయ ఈవో వెంకట్రావు తెలిపిన వివరాల ప్రకారం బాలుడు సంతోష్ ఎనిమిది సంవత్సరాలు పుష్కరిణిలోకి దిగినప్పుడు నీటి చల్లదనానికి ఫిట్స్ వచ్చిందని,నీళ్లలో మునిగి మృతిచెందినట్లు తెలిపారు. వెంటనే అప్రమతం మైన సిబ్బంది స్థానిక పోలీసు స్టేషన్ లో సమాచారమిచ్చి మృతదేహాన్ని బయటకు తీసినట్లు తెలిపారు. పోలీసులు పంచనామా అనంతరం బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

**సంప్రోక్షణ అనంతరం భక్తులకు అనుమతి..**

పుష్కరిణిలో పడి బాలుడు మృతిచెందడంతో సంప్రోక్షణ నిర్వహించారు.పుష్కరిణిలోని నీటిని మొత్తం ఖాళీ చేసి ఆలయ అర్చకులతో శుద్ధిచేసి సంప్రోక్షణ నిర్వహించారు. సంప్రోక్షణ అనంతరం మళ్లీ నీళ్లు నింపి భక్తులకు అనుమతించారు.

## గిరిజనగర్ సర్పంచ్ అభ్యర్థిగా నేనావత్ కమిలి నాగార్జున నాయక్ నామినేషన్



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ మండలం గిరిజానగర్ తండా గ్రామా పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా నేనావత్ కమిలి నాగార్జున నాయక్ కొండభీమన పల్లి గ్రామా పంచాయతీ కార్యాలయం లో నామినేషన్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారులకు అందజేయడం జరిగింది.

## శాంతిగూడెం గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా చరణ్ నామినేషన్

**జయభేరి, డిండి:**

డిండి మండలం శాంతి గూడెం గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా తోట చరణ్ సన్నాఫ్ రాములు కందుకూరు గ్రామంలో రిటర్నింగ్ అధికారులకు నామినేషన్ పత్రాలు అందజేయడం జరిగింది.

## మద్యం సిట్టింగ్ కోసం షెడ్ల నిర్మాణాలు
## కొరవడిన అధికారులు పర్యవేక్షణ..
# ప్రభుత్వ ఆదాయానికి గండి

**జయభేరి, మేడ్చల్ :**



జీహెచ్ఎంసీ పరిధి మేడ్చల్ లో అక్రమ నిర్మాణాలు పలువురికి కాసులు కురిపిస్తున్నాయి. గత కొంతకాలంగా మున్సిపాలిటీ పరిదిలో ఇష్టానుసారంగా తాత్కాలిక షెడ్ల నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. అక్రమ నిర్మాణాలతో అక్రమార్కులు ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. ఇలాంటి నిర్మాణాలను అడ్డుకొని చర్యలు తీసుకోవాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మేడ్చల్ మున్సిపాలిటీ జాతీయ రహదారి అనుకోని ఉండటంతో చుట్టుపక్కల అనేక విద్యాసంస్థలు, పరిశ్రమలు ఉండటం వల్ల వందల రకాల వ్యాపార సముదాయాలకు కావాల్సిన షెడ్ల నిర్మాణాలు వెలుస్తున్నాయి. ఇదే ప్రాంతంలో రోజు ఏదోఒక చోట అక్రమ షెడ్లు వేలుస్తుండటం అలాంటి వ్యాపార కేంద్రాలకు ట్యాక్స్‌ను విధించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడం, అక్రమ నిర్మాణాలపై రెట్టింపు పన్నులు విధించకపోవడంతో అధికారులపై అనేక అనుమానాలకు తావిస్తున్నది. నూతన మద్యం పాలసిలో దుకాణాలు దక్కించుకున్న కొందరు వ్యాపారులు మద్యం సిట్టింగ్ ల కొరకు ఎలాంటి అనుమతులు లేకుండా రాత్రికి రాత్రి అక్రమ షెడ్ల నిర్మాణాలు చేస్తున్నారు. సామాన్యుడు చిన్న ఇల్లు నిర్మించుకుంటే వంద కారణాలు వెతికే అధికారులకు జాతీయ రహదారి అనుకోని అక్రమంగా చేపడుతున్న నిర్మాణాలు కనిపించకపోవడం విడ్డురంగా ఉందని పలువురు విమర్శిస్తున్నారు.

**కొరవడిన అధికారులు పర్యవేక్షణ..**

మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలో కొన్ని ముఖ్య కూడళ్లు, ప్రధాన రోడ్లపై అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా వెలుస్తున్నాయి. కొందరు మున్సిపాలిటీ నుంచి ఎలాంటి అనుమతుల్లేకుండానే రేకుల పై కప్పులతో ఏకంగా షాపులనే నిర్మించి వాటిని వ్యాపార, వాణిజ్య సంస్థలకు అద్దెకు ఇస్తూ రూ.లక్షల్లో ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది పర్యవేక్షణ కొరవడడంతో మున్సిపాలిటీ ప్రతి ఏటా రూ. లక్షల్లో రాబడిని కోల్పోతున్నది. మేడ్చల్ లో అనేక కాలనీలు వెలియడంతో లక్షలాది మంది ప్రజలను దృష్టిలో పెట్టుకొని ప్రధాన రోడ్లపై కొందరు భవన యజమానులు స్థానిక మున్సిపాలిటీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే యథేచ్ఛగా రేకులపై కప్పులతో పాటు షెట్టర్లు బిగించి వందలాది షాపులను నిర్మిస్తున్నారు. దింతో ఎక్కడ చూసినా అనుమతులు లేని షెడ్ల దర్శనమిస్తున్నాయి. వాటిని వివిధ వ్యాపార, వాణిజ్య సంస్థలకు నెలకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు అద్దెకిస్తూ ప్రతి ఏటా రూ. లక్షల్లో ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. అక్రమ నిర్మాణాలను కట్టడి చేయాల్సిన టౌన్ ప్లానింగ్, రెవెన్యూ విభాగం అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించిన దాఖలాలు లేవని స్థానికులు ఆరోపిస్తున్నారు. మున్సిపల్ సిబ్బంది చేతివాటంతో మున్సిపాలిటీ భారీగా ఆదాయాన్ని కోల్పోతున్నది. వాస్తవానికి మున్సిపాలిటీ పరిధిలో ఇల్లు (రెసిడెన్షియల్), దుకాణాలు (కమర్షియల్) నిర్మించే ముందు స్థల యజమాని అన్ని ధ్రువీకరణ పత్రాలు సమర్పించి మున్సిపల్ అధికారుల నుంచి అనుమతి పొందాలి. ఆ తర్వాతే నిర్మాణాన్ని చేపట్టాల్సి ఉంటుంది. నిర్మాణం పూర్తయ్యాక డోర్ నంబర్‌తో పాటు అసెస్‌మెంట్ చేయించుకుని ఏటా ఆస్తి పన్ను చెల్లించాలి. కానీ మేడ్చల్ లో వెలుస్తున్న షెడ్లకు అలాంటి నిబంధనలు వర్తించడం లేదని అధికారులకు అక్రమార్కులకు ఉన్న ఒప్పందం ఏంటో అనే ప్రశ్నలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి.

## శ్రీకాంతాచారి ఆశయ సాధన కోసం పోరాటం చేయాలి

**జయభేరి, దేవరకొండ :**



శ్రీకాంత్ చారి ఆశయ సాధన కోసం కృషి చేయాలి. సామాజికవేత్త బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్. దేవరకొండ పట్టణంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ అమరవీరుడు శ్రీకాంత్ చారి 16 వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించినారు. ఆయన చిత్రపటానికి పూల మాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సామాజికవేత్త బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ శ్రీకాంత్ చారి తెలంగాణ రాష్ట్రం వస్తే విద్యా,ఉద్యోగ,నిధులు నియామకాల్లో న్యాయం జరుగుతుందని ఉద్యమాన్ని బలపరచడానికి అమరుడు అయినటువంటి శ్రీకాంత్ చారి ఆశయాల సాధన కోసం నేటి యువత ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్లాలని కోరారు. శాంతియుతంగా నేటి యువత జాబ్ క్యాలెండర్ విషయంలోకానీ పలు రకాల అంశాలు సాధించుకోవడానికి ఉద్యమ రూపంలో ముందుకొచ్చి సాధించుకునే దిశలో ముందుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్డి కోటేశ్వరరావు,సరిగదెల విఠలాచారి, కూరెళ్ళ కృష్ణమాచారి,పున్న వెంకటేష్ నేత, జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ భాష చౌహాన్, ఎండి ఖాదర్ బాబా, పెరికేటి శ్రీనివాస్ చారి, దామెర సామ్సంన్,మద్దిమడుగు నగేష్,శివ,లైబ్రేరియన్ శారద తదితరులు పాల్గొన్నారు.

## నా కొడుకు జయంతి, వర్ధంతిలకు అడ్డుపడుతున్నారు

- శ్రీకాంత్ చారి తల్లి శంకరమ్మ

**జయభేరి, హైదరాబాద్:**

శ్రీకాంత్ చారి పదహారోవ వర్ధంతి రోజు శ్రీకాంత్ చారి తల్లి శంకరమ్మ కాంగ్రెస్ పార్టీ జిల్లా మంత్రులపై, స్తానిక ఎమ్మెల్యే పై సంచలన కామెంట్ చేశారు. టీఆర్ఎస్ పార్టీ హయాంలో శ్రీకాంత్ చారి వర్ధంతి కానీ జయంతి కానీ బాగా చేసారు. కొన్ని పరిస్థితుల వల నేను కాంగ్రెస్ పార్టీలో జాయిన్ అయ్యాను. గత మూడు సంవత్సరాల నుండి కాంగ్రెస్ నాయకులు పట్టించుకోవడం లేదు. సొంత నియోజకవర్గంలో విగ్రహాలు పెట్టొద్దు, జయంతి లు , వర్ధంతులు చేసుకోవద్దు అని కాంగ్రెస్ నాయకులు అడ్డుకుంటున్నరని ఆరోపించారు. శ్రీకాంత్ చారి ఆత్మబలిదానం వల్ల వచ్చిన తెలంగాణ లో జిల్లా కాంగ్రెస్ మంత్రులు ఎమ్మెల్యే బుగ్గ కారులలో తిరుగుతూ మూడు సంవత్సరాల నుండి విగ్రహాలు పెట్టకుండా , వర్ధంతి, జయంతి చేసుకోకుండా ఇబ్బంది పెడుతున్నారు. ఈ విషయాన్ని అంత రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తా. జిల్లా మంత్రులు , నియోజవర ఎమ్మెల్యే నన్ను చాలా ఇబ్బందులు పెడుతున్నాడు.. నేను కాంగ్రెస్ పార్టీ లోనే ఉన్నాను ఎందుకు నన్ను ఇబ్బంది పెడుతున్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ చేయబట్టి నేను మోసపోయా.. ఉత్తమ్ కుమార్ రెడి నా కొడుకు వర్ధంతి నీ నాలుగవ తారీకు పెట్టుకొన్నాడు.

# అన్ని రంగాల్లో దివ్యాంగులకు సరైన ప్రోత్సాహం

- యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత్ రావు

**జయభేరి, యాదాద్రి భువనగిరి జిల్లా :**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు హక్కులను కల్పించడంతో పాటు సమాజంలో వారి ప్రతిభను గుర్తించి అన్ని రంగాల్లో వారిని ప్రోత్సహించడం జరుగుతుందని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత్ రావు అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్నిపురస్కరించుకొని బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో దివ్యాంగుల దినోత్సవ వేడుకలను యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత్ రావు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు,జెడ్పి సీఈవో శోభా రాణి,జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి,జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు, జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం రోజు పలు ప్రాంతాల నుండి ఇక్కడకు వచ్చి దివ్యాంగుల దినోత్సవం జరుపుకోవడం గొప్ప విషయమని అన్నారు. దివ్యాంగుల కోసం ప్రభుత్వం ప్రత్యేక అవకాశాలు కల్పిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దివ్యాంగులు శారీర లోపమే గాని మానసికంగా,స్థిరమైన ఆరోగ్యం కలిగి ఉంటారని అన్నారు. దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్లాలన్నారు. UDID కార్డుల జారీ విషయంలో యాదాద్రి భువనగిరి జిల్లా 6వ స్థానంలో ఉందన్నారు. దివ్యాంగుల కోసం ప్రత్యేక మెగా క్యాంపు నిర్వహించడం జరుగుతుందని,వారి యొక్క సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. అర్హులైన దివ్యాంగుల కోసం ట్రై సైకిల్, బ్యాటరీ సైకిల్ ను కూడా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అంగవైకల్యం ఉన్న వారు తక్కువ కాదని, ఉన్నత శిఖరాలను అధిరోహించడం కూడా జరిగిందన్నారు.

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లాలోని దివ్యాంగుల పిల్లల కోసం ప్రతి మండలంలో ఉపాధ్యాయులు వారి ఇంటికి వెళ్తున్నారు. వారి ప్రత్యేక అవసరాలను వారు తీరుస్తున్నారు. కావున ఈ అవకాశాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సదరం సర్టిఫికెట్ల కోసం ఆన్ లైన్ లో అప్లై చేసిన వారందరికీ సర్టిఫికెట్లు ఇవ్వడం జరిగిందన్నారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి మాట్లాడుతూ దివ్యాంగులకు ఉపాధి హామీ పథకం కింద వారి సామర్థ్యాన్ని బట్టి జాబ్ కార్డు ఇవ్వడం జరుగుతుందన్నారు.

యాదాద్రి జిల్లాలోని 12,626 మందికి ఐదు కోట్ల ఏడు లక్షలు పెన్షన్లు దివ్యాంగుల ఖాతాలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా లోని 24251 పనిదినాలకు 72 లక్షలు ఉపాధి హామీ కింద వారి ఖాతాలో జమ చేయడం జరిగిందని తెలిపారు.

యాదాద్రి భువనగిరి జిల్లాలోని సదరం క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. దివ్యాంగులందరూ తమ ప్రతిభతో వివిధ రంగాల్లో ముందుకు వెళ్తున్నారన్నారు. దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహించగా, గెలుపొందిన వారికి బహుమతులు యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత్ రావు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బాస్కర్ రావు ప్రధానం చేయడం జరిగింది. దివ్యాంగుల కమిటీ మెంబర్లను సన్మానించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో APD జంగారెడ్డి, సదరం ఎగ్జిక్యూటివ్ మెంబర్ మైత్రేయి,జిల్లా ఆసుపత్రి సూపరింటెంట్ పాండు నాయక్, మెప్మా అధికారి రమేష్,సిడిపిఓలు, ఏపీఎంలు, దివ్యాంగుల అసోసియేషన్స్, జిల్లా సమైక్య అధ్యక్షులు రేణుక,జిల్లా సంక్షేమ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.







# భవిత కేంద్రాలతో దివ్యాంగుల మానసిక అభివృద్ధి

- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**జయభేరి, కరీంనగర్:**

భవిత కేంద్రాల్లో ప్రత్యేక విద్యా విధానం ద్వారా దివ్యాంగ పిల్లలు మానసికంగా అభివృద్ధి చెందుతారని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. తిమ్మాపూర్ మండలం మహాత్మా నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నూతనంగా నిర్మించిన భవిత కేంద్రాన్ని ప్రత్యేక అవసరాలు గల పిల్లల పాఠశాల,జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ. భవిత కేంద్రాల్లో ప్రత్యేక పద్ధతిలో విద్యా బోధన ద్వారా దివ్యాంగ విద్యార్థుల్లో ఎంతో మార్పు కనిపిస్తోందని తెలిపారు. చిన్న వయసులోనే భవిత కేంద్రంలో చేర్పిస్తే ప్రత్యేక అవసరాలు గల పిల్లలు తల్లిదండ్రుల అవసరం లేకుండానే సొంతంగా వారి పనులు చేసుకునే స్థాయికి చేరుకోగలరని అన్నారు. జిల్లాలో దివ్య దృష్టి, కార్యక్రమం ద్వారా ప్రభుత్వ అంధుల, బధిరుల పాఠశాల, భవిత కేంద్రాలను ఎంతగానో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. అక్కడ చదివే పిల్లల అభివృద్ధికి కృషి చేస్తున్నామని అన్నారు. అధికారులకు, పాఠశాలలు, ఆసుపత్రుల సిబ్బందికి సైగల భాష నేర్పడం ద్వారా బధిరుల భావాలను వారు అర్థం చేసుకుంటున్నారని అన్నారు. భవిత కేంద్రాల్లో పని చేస్తున్న ప్రత్యేక విద్య బోధించే ఉపాధ్యాయుల సేవలు అభినందనీయమని అన్నారు. అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ. దివ్యాంగుల కోసం జిల్లాలో అనేక కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. దివ్యాంగుల పాఠశాలలు, భవిత కేంద్రాల్లో అన్ని రకాల సదుపాయాలను కల్పించామని తెలిపారు. భవిష్యత్తులో దివ్యాంగ విద్యార్థుల చదువుకు, వారి అభివృద్ధికి మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి మొండయ్య, తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో మల్హోత్ర, విద్యా శాఖ కో ఆర్డినేటర్ మిల్కూరి శ్రీనివాస్ ఎంఈఓ శ్రీనివాస్, డిఈ కృష్ణ కుమార్, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ పాల్గొన్నారు. బుధవారం బోధనలో ప్రతి విద్యార్థి పాల్గొనాలి. మహాత్మా నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం బోధన కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పరిశీలించారు. విద్యార్థులతో పాఠాలు చదివించారు. కొందరు విద్యార్థులు పాఠాలు సరిగ్గా చదవకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. 10వ తరగతి పరీక్షలు దగ్గర పడుతున్నందున విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ప్రతి రోజు పాఠాలు బిగ్గరగా చదవించాలని అన్నారు. బుధవారం భోదనలో ప్రతి విద్యార్థిని భాగస్వామ్యం చేయాలని, ప్రతి ఒక్కరితో పాఠాలు చదివించాలని ఆదేశించారు. విద్యార్థులు పట్టుదలతో నేర్చుకోవాలని, అర్థం కానీ సబ్జెక్ట్ ను ఉపాధ్యాయుల ద్వారా మరోసారి అడిగి తెలుసుకోవాలని తెలిపారు.

# పంచాయితీ సిత్రాలు..

- తండ్రి కొడుకుల మధ్య పోటీ



**జయభేరి, హైదరాబాద్, డిసెంబర్ 3:**

తెలంగాణ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పలు ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. కొన్ని గ్రామాల్లో సర్పంచ్ పదవులను వేలం వేస్తున్నారు. గ్రామాభివృద్ధి కోసం ఈ వేలం నిర్వహిస్తున్నట్లు చెబుతున్నారు. మరికొన్ని గ్రామాల్లో బంధువులు, స్నేహితులు పోటీ పడుతున్నారు. మెదక్ జిల్లా రామాయంపేట మండలం ఝాన్సిలింగాపుర్ గ్రామంలో తండ్రీకొడుకులు సర్పంచ్ ఎన్నికల్లో పోటీ పడుతుండటం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. గ్రామంలో సర్పంచ్ స్థానానికి తండ్రి మానెగళ్ల రామకృష్ణయ్య, కుమారుడు వెంకటేశ్ నామినేషన్లు దాఖలు చేశారు. ఈ గ్రామంలో 1,563 మంది ఓటర్లు ఉన్నారు. ఇక్కడ సర్పంచ్ స్థానానికి మొత్తం 10 నామినేషన్లు దాఖలయ్యాయి. నల్గొండ జిల్లా చండూరు మండలం బంగారిగడ్డ గ్రామ పంచాయతీలో కనకదుర్గమ్మ ఆలయ నిర్మాణం, గ్రామాభివృద్ధి కోసం సర్పంచ్ పదవిని ఏకగ్రీవం చేయాలని నిర్ణయించారు. వేలం వేయగా సర్పంచ్ పదవిని రూ. 73 లక్షలకు మహమ్మద్ సమీనా ఖాసీమ్ అనే మహిళ దక్కించుకున్నారు.జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్ గ్రామంలోనూ వేలం పాటలో ఒక వ్యక్తి సర్పంచ్ పదవిని దక్కించుకోగా, గ్రామస్తులు కొందరు సర్పంచ్ వేలంపై పోలీసులకు సమాచారం అందించారు. ఈ ఘటనకు సంబంధించి 10 మందిని బైండోవర్ చేసినట్లు తహసీల్దారు తెలిపారు.

# ఆర్ధరాత్రి టిప్పర్ బీభత్సం



**జయభేరి, హైదరాబాద్:**

మలక్పేట్ పోలీసు స్టేషన్ పరిధిలోని ముసరాంబాగ్ క్రాస్ రోడ్డు (TV టవర్ వద్ద) మంగళవారం ఆర్ధ రాత్రి భయానక రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. సిగ్నల్ పడడంతో ఆగి ఉన్న లారిని, అస్మాన్ఘడ్ గడ్డ పై నుంచి వేగంగా వచ్చిన టిప్పర్ అదుపుతప్పి డివైడర్ ను దాటి ఢీకొంది. టిప్పర్ డ్రైవర్ వాహనం వదిలి పరారైనట్లుగా సమాచారం. ఈ ఘటనలో టిప్పర్...లారీ, మధిర వెళ్తున్న ఆర్టీసీ బస్సు, ఒక కార్ ను ఢీ కొనడం తో నాలుగు వాహనాలు ధ్వంసం కావడం జరిగింది. బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు అందరూ సురక్షితంగా బయటపడ్డారు. అదృష్టవశాత్తూ రాత్రి సమయం కావడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ సమయంలో హైదరాబాద్ నుండి వివిధ రాష్ట్రాలకు ప్రభుత్వ, ప్రైవేట్ టూరిస్ట్ బస్సులు బయలుదేరుతుండడంతో, ప్రమాద స్థలంలో భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు క్షణాల్లో అక్కడికి చేరుకుని ట్రాఫిక్ను పునరుద్ధరించారు. టిప్పర్ బ్రేక్ ఫెయిల్ అయ్యాయా? లేక డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నాడా? అనే కోణాల్లో మలక్పేట్ పోలీసులు విచారణ ప్రారంభించారు.

# ఇక మొత్తం నాలుగు బ్యాంకులే...

**జయభేరి, ముంబై, డిసెం...**




ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొన్ని ప్రభుత్వ రంగ బ్యాంకులను విలీనం చేసింది. అప్పట్లో కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం సంచలనం సృష్టించింది.. ఇప్పుడిక మళ్లీ విడత విలీన ప్రక్రియకు కేంద్రం సిద్ధమవుతున్న తెలుస్తోంది. ఇప్పటికిప్పుడు కేంద్రం ఈ నిర్ణయం తీసుకోవడం వెనుక అసలైన అంతరార్థం ఏంటనేది సామాన్యులకు అంతు పట్టకుండా ఉంది. ప్రస్తుతం మన దేశంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు 12 వరకు ఉన్నాయి. వీటి సంఖ్యను నాలుగు వరకు తగ్గించాలని కేంద్రం భావిస్తోంది. తద్వారా నాలుగు పెద్ద బ్యాంకులుగా మారుస్తామని చెబుతోంది.. ఇకపై స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, కెనరా - యూనియన్ బ్యాంకులు మాత్రమే ఉంటాయని తెలుస్తోంది.

మిగతా బ్యాంకులను వీటిలో విలీనం చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలుస్తోంది. కెనరా బ్యాంక్, యూనియన్ బ్యాంకు విలీనం. గతంలో యూనియన్ బ్యాంకులో ఆంధ్ర బ్యాంకు విలీనమైంది. ఇప్పుడు కెనరా బ్యాంకు, యూనియన్ బ్యాంక్ విలీనం అయ్యే అవకాశం కనిపిస్తోంది. వీటికింద ఇండియన్ బ్యాంకు, యూకో బ్యాంక్ లను తీసుకొస్తారని ప్రచారం జరుగుతుంది. తద్వారా ఏర్పాటయ్యే పెద్ద బ్యాంకు తోపాటు, వచ్చే రోజుల్లో కేవలం ఎస్బిఐ, పిఎన్బి, బి ఓ బి లను మాత్రమే కొనసాగించే ఆలోచనలో కేంద్రం ఉన్నట్టు తెలుస్తోంది. ఇక ఇతర మధ్య తరహా ప్రభుత్వ రంగ బ్యాంకులైన ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, ఎస్బిఐ, పిఎన్బి, బి ఓ బి లో విలీనం చేసే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. మరోవైపు పంజాబ్ అండ్ సింధు బ్యాంకుపై ఇప్పటివరకు కేంద్రం ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది. ఇప్పటికైతే విలీనం గురించి చర్చలు మాత్రమే జరుగుతున్నాయి. ఆర్థిక మంత్రి ఆమోదం కోసం ఫైల్ పంపించిన తర్వాత.. అక్కడి నుంచి అనుమతి అనేది లభించిన తర్వాత.. క్యాబినెట్ సెక్రటేరియట్ లో ఉన్నతాధికారుల అభిప్రాయాలను తీసుకుంటారు. ఆ తర్వాత ప్రధాన కార్యాలయం వరకు పంపిస్తారు. మార్కెట్లను నియంత్రించే సెబీ పరిశీలనకు కూడా ఈ ఫైల్ వెళ్తుంది. ఇవన్నీ ఓకే అయితే వచ్చే ఏడాది విలీన ప్రక్రియ పూర్తవుతుంది. ఎన్డీఏ అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి విడత విలీన ప్రక్రియలో 27 నుంచి 12 వరకు బ్యాంకుల సంఖ్యను తగ్గించారు. బ్యాలెన్స్ షీట్లను బలోపేతం చేయడం.. కార్యాలయాల సామర్థ్యాన్ని మెరుగుపరచడం.. అంతర్జాతీయంగా పోటీని పెంచడం వంటి వాటి ద్వారా బ్యాంకుల విలీన ప్రతిపాదనను ఆర్థిక శాఖ రూపొందించినట్లు తెలుస్తోంది.. పెద్ద బ్యాంకులుగా ఏర్పాటు చేయడం వల్ల ఖాతాదారుల్లో కూడా విశ్వసనీయత పెరుగుతుందని ఆర్థిక శాఖ అధికారులు భావిస్తున్నారు.



# జనసేనలోకి హేమ

**జయభేరి, హైదరాబాద్, డిసెంబర్ 3:**

సినీ పరిశ్రమకు చెందిన చాలామంది వ్యక్తులు రాజకీయాల్లో రాణించారు. అయితే అందులో సక్సెస్ అయిన వారు కొంతమందే. ఆర్కే రోజా రాజకీయాల్లోకి వచ్చి మంత్రి స్థాయికి ఎదిగారు. ఆపై పవన్ కళ్యాణ్ సైతం ఈ రాష్ట్రానికి డిప్యూటీ సీఎం అయ్యారు. మెగా బ్రదర్ నాగబాబు సైతం ఎమ్మెల్సీ అయ్యారు. వైసీపీ హయాంలో పోసాని కృష్ణ మురళి, అలీ, 30 ఇయర్స్ ఇండస్ట్రీ పృథ్వీరాజ్ తదితరులు నామినేటెడ్ పదవులు అనుభవించారు. అయితే చిత్ర పరిశ్రమ నుంచి వచ్చిన వ్యక్తులు వివాదాస్పద ముద్రను చాటుకున్నారు. అయితే కొంతమంది ఇలా వచ్చి అలా మళ్లీ సినీ పరిశ్రమలోకి వెళ్ళిపోయారు. ఇటువంటి పరిస్థితుల్లో క్యారెక్టర్ ఆర్టిస్ట్, నటిగా గుర్తింపు తెచ్చుకున్న హేమ రాజకీయాల్లోకి వస్తారని తెలుస్తోంది. ఇటీవల తన మనసులో ఉన్న మాటను కూడా ఆమె బయటపెట్టారు. డ్రగ్స్ కేసులో ఇరుక్కుని.. కామెడీ పరంగా కూడా చాలామంది మహిళ నటీమణులు రాణించారు. అందులో హేమ కూడా ఒకరు. గత కొంతకాలంగా ఆమె సినిమాల్లో పెద్దగా కనిపించడం లేదు. డ్రగ్స్ కేసులో ఇరుక్కున్నారు. జైలుకు కూడా వెళ్లారు. ఇటీవల ఆమెకు క్లీన్ చీట్ లభించింది. అయితే ఇప్పుడు ఆమె మూవీ ఆర్ట్స్ అసోసియేషన్ కు సంబంధించిన వివాదాన్ని పరిష్కరించేందుకుగాను పవన్ కళ్యాణ్ ను కలుస్తానని చెబుతున్నారు. పనిలో పనిగా తన రాజకీయ ఆసక్తి, తన అభిలాషను సైతం పవన్ కళ్యాణ్ కు వివరిస్తానంటున్నారు. త్వరలో జనసేనలో చేరుతానని కూడా హింట్ ఇస్తున్నారు. అయితే ఆమెను జనసేనలోకి తీసుకుంటారా? లేదా? అన్నది చూడాలి. నటిగా గుర్తింపు.. గోదావరి ప్రాంతాలకు చెందిన హేమ క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా సినీ పరిశ్రమలో అడుగుపెట్టి తనకంటూ ఒక ముద్ర చాటుకున్నారు. కామెడీ టైమింగ్ ఉన్న నాటిగా గుర్తింపు తెచ్చుకున్నారు. అయితే 2014 ఎన్నికల్లోనే ఆమె రాజకీయాల్లోకి వచ్చారు. సమైక్యాంధ్ర ఉద్యమ పార్టీ నుంచి పోటీ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు చివరి ముఖ్యమంత్రిగా ఉన్న కిరణ్ కుమార్ రెడ్డి ఆ పార్టీని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. అప్పట్లో గోదావరి జిల్లాలో ఓ నియోజకవర్గంలో నుంచి పోటీ చేసిన హేమ నాలుగువేల వరకు ఓట్లు సొంతం చేసుకున్నారు. అయితే తర్వాత ఆమెకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి సైతం ఆఫర్లు వచ్చినట్లు తెలుస్తోంది. కానీ ఆమె మాత్రం జనసేనలో చేరుతారని ప్రచారం అన్నది సాగుతోంది. తనకు టీటీడీ బోర్డు మెంబర్ గా ఆసక్తి ఉందని ముందుగానే ప్రకటించుకున్నారట హేమ. చూడాలి ఆమె జనసేనలో చేరుతారా? లేదా? అన్నది.

# తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్

- అన్ని రాష్ట్రాల సీఎంలకు ఆహ్వానం

**జయభేరి, హైదరాబాద్ :**




డిసెంబర్ 8 9 తేదీల్లో హైదరాబాద్ లో నిర్వహించే తెలంగాణ రైసింగ్ గ్లోబల్ సమ్మిట్ కు అన్ని రాష్ట్రాల సీఎం లను ప్రత్యేకంగా ఆహ్వానించాలని ముఖ్య మంత్రి ఎ. రేవంత్ రెడ్డి నిర్ణయించారు.

స్వయంగా మన రాష్ట్ర మంత్రులు వెళ్లి వారిని ప్రత్యేకంగా కలిసి ఈ సదస్సుకు ఆహ్వానిస్తారు. ఎవరెవరు ఏ ఏ రాష్ట్రాలకు వెళ్లాలో సీఎం నిర్ణయించారు. ఈ నెల 4 వ తేదీన మంత్రులు ఆయా రాష్ట్రాలకు వెళ్లి గ్లోబల్ సమ్మిట్ ఆహ్వాన లేఖలు అందిస్తారు.

జార్ఖండ్ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, జమ్మూ కాశ్మీర్ గుజరాత్ ఉత్తమ్ కుమార్ రెడ్డి, పంజాబ్ హర్యానా దామోదర్ రాజనర్సింహ, ఆంధ్రప్రదేశ్, కేరళ కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కర్ణాటక తమిళనాడు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఉత్తర ప్రదేశ్ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి , రాజస్థాన్ పొన్నం ప్రభాకర్, చత్తీస్ గడ్ కొండ సురేఖ , వెస్ట్ బెంగాల్ సీతక్క , మధ్యప్రదేశ్ తుమ్మల నాగేశ్వరరావు , అస్సాం జూపల్లి కృష్ణా రావు, బీహార్ వివేక్ వెంకటస్వామి , ఒడిస్సా వాకిటి శ్రీహరి, హిమాచల్ ప్రదేశ్ అడ్లూరు లక్ష్మణ్ కుమార్, మొహమ్మద్ అజారుద్దీన్ మహారాష్ట్ర, ఢిల్లీ సీఎం, కేంద్ర మంత్రులను ఎంపీ లు ఆహ్వానం అందిస్తారు.



# ఫ్యామిలీ వెకేషన్‌లో లయ..
## కూతురు, కుమారుడు ఎంత క్యూట్‌గా ఉన్నారో?

ఒకప్పుడు స్టార్ హీరోయిన్ గా తెలుగు సినిమా ఇండస్ట్రీలో ఓ వెలుగు వెలిగింది లయ. అయితే పెళ్లి, పిల్లల కారణంగా చాలా ఏళ్ల పాటు సినిమా ఇండస్ట్రీకి దూరమైంది. మళ్లీ ఇప్పుడే రీ ఎంట్రీ ఇచ్చి వరుసగా సినిమాలు చేస్తోంది. అలాగే పలు టీవీ షోల్లోనూ సందడి చేస్తూ బుల్లితెర ఆడియెన్స్ కు దగ్గరవుతోంది. ఇటీవలే 'తమ్ముడు' సినిమాతో రీఎంట్రీ ఇచ్చింది సీనియర్ హీరోయిన్ లయ. ఇందులో నితిన్ కు అక్కగా నటించి ఆడియెన్స్ ను మెప్పించింది. అయితే ఈ సినిమా కమర్షియల్ గా విజయం సాధించలేకపోయింది. అయినా లయ చేతిలో ప్రస్తుతం పలు సినిమాలున్నాయి. అలాగే పలు టీవీ షోల్లోనూ సందడి చేస్తూ బుల్లితెర ఆడియెన్స్ కు దగ్గరవుతోందీ అందాల తార. ఇదిలా ఉంటే సినిమా షూటింగులతో బిజీగా ఉంటోన్న లయ ఇటీవలే తన కుటుంబ సభ్యులతో కలిసి సరదాగా వెకేషన్ కు వెళ్లింది. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను తన సోషల్ మీడియాలో షేర్ చేసింది లయ. ప్రస్తుతం ఈ ఫొటోలు నెట్టింట వైరలవుతున్నాయి ముఖ్యంగా ఈ ఫొటోల్లో లయ కుమారుడు, కూతురు చాలా క్యూట్ గా కనిపిస్తున్నారు. వీటిని చూసిన నెటిజన్లు క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు. కాగా లయ కూతురు శ్లోక ఇదివరకు రవితేజ నటించిన అమర్ అక్బర్ ఆంటోని చిత్రంలో చైల్డ్ ఆర్టిస్టుగా కనిపించింది. ఆ తర్వాత మరో సినిమా చేయలేదు.

# తండ్రీకూతుళ్ల కథగా ఇరుముడి?



హీరో రవితేజ ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. ఆయన తాజా చిత్రం 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' సంక్రాంతి బరిలో విడుదలకు సిద్ధమవుతున్నది. ఇదిలావుండగా శివ నిర్వాణ దర్శకత్వంలో రవితేజ ఓ చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. అగ్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్నది. ప్రస్తుతం హైదరాబాద్‌లో షూటింగ్ జరుగుతున్నది. ప్రియా భవానీ శంకర్ కథానాయిక. ఈ చిత్రానికి 'ఇరుముడి' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు వార్తలొస్తున్నాయి. తండ్రీకూతుళ్ల అనుబంధాన్ని ఆవిష్కరించే కథాంశమిదని, కూతురి రక్షణ కోసం ఎంతదూరమైనా వెళ్లే తండ్రిగా రవితేజ పాత్ర భావోద్వేగభరితంగా సాగుతుందని చెబుతున్నారు. థ్రిల్లర్ అండ్ డివోషనల్ ఎలిమెంట్స్ కలబోతగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు సమాచారం. అయితే ఈ సినిమా టైటిల్‌పై వస్తున్న వార్తల్లో నిజమెంతో తెలియాలంటే చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే.



# కాస్టింగ్ కౌచ్ వేధింపులు..

తెలుగుతోపాటు హిందీ, తమిళం, కన్నడ భాషలలో అనేక చిత్రాల్లో నటించి మంచి పాపులారిటీని సంపాదించుకుంది హీరోయిన్ మదాలస శర్మ. అల్లరి నరేష్ హీరోగా నటించిన ఫిట్టింగ్ మాస్టర్ సినిమాతో తెలుగు తెరకు పరిచయం అయ్యింది. ఆ తర్వాత తెలుగులో పలు చిత్రాల్లో నటించి మెప్పించింది. ప్రస్తుతం ఆమె ఇండస్ట్రీకి దూరంగా ఉన్నారు. కొన్నాళ్ల క్రితం ఆమె ఓ ఇంటర్వ్యూలో చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో వైరలవుతున్నాయి. కెరీర్ ప్రారంభంలో తనకు ఎదురైన చేదు అనుభవాలను గుర్తుచేసుకున్నారు. కొన్నేళ్ళ తర్వాత సౌత్ ఇండస్ట్రీని ఎందుకు వదిలేయాల్సి వచ్చిందో వివరించారు. "కెరీర్ ప్రారంభంలో నాకు కొన్ని చేదు అనుభవాలు ఎదురయ్యాయి. నేను ఆ దారిలో ముందుకు వెళ్లలేనని నాకు అనిపించింది. క్యాస్టింగ్ కౌచ్ వంటివి అన్ని చోట్లా ఉంటాయి. 17 ఏళ్ల వయసులో ఓ సంభాషణ నన్ను చాలా ఇబ్బంది పెట్టింది. అలా అనిపించగానే అక్కడి నుంచి బయటకు వచ్చేసి ముంబై తిరిగి వెళ్లిపోవాలని అనుకున్నాను" అంటూ చెప్పుకొచ్చారు. ప్రస్తుతం ఆమె చేసిన కామెంట్స్ నెట్టింట వైరలవుతున్నాయి. మదాలస శర్మ.. తెలుగులో వరుస సినిమాల్లో నటించినప్పటికీ ఆశించిన స్థాయిలో గుర్తింపు రాలేదు. 2009లో ఫిట్టింగ్ మాస్టర్ తర్వాత శౌర్య, ఆలస్యం అమృతం,



# కారణం పవన్ కల్యాణ్ అంటున్న స్టార్..

ప్రేక్షకులకే కాదు, నటీనటులకు కూడా అభిమాన నటులు ఉంటారు. వారిని కలవడం, మాట్లాడటం మాత్రమే కాదు, కుదరితే కెరీర్లో ఒక్కసారైనా వాళ్లతో కలిసి పనిచేస్తూ స్క్రీన్ షేర్‌చేసుకోవాలని కలలు కంటారు చాలామంది. అలాంటి కల తనకు కూడా ఉండేదని, ఆ కల నెరవేర్చుకునేందుకే ఆ.. కథ వినకుండా సంతకం పెట్టిన మొదటి సినిమా ఇదే.. కారణం పవన్ కల్యాణ్ అంటున్న స్టార్ హీరోయిన్ దక్షిణ భారత చలనచిత్రరంగంలో ప్రముఖ నటిగా పేరొందిన రాశి ఖన్నా, తెలుగు, తమిళ్, హిందీ భాషల్లో తనదైన ముద్ర వేసుకున్నారు. ప్రస్తుతం ఆమె కెరీర్‌లో మైలురాయిగా నిలిచే ప్రాజెక్టు పవర్ స్టార్ పవన్ కల్యాణ్‌తో కలిసి నటిస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్'. ఈ సినిమాలో హీరోయిన్‌గా ఎంపిక కావడం రాశి ఖన్నాకు కేవలం మరో ప్రాజెక్టు మాత్రమే కాదు, అది ఆమె చిరకాల కల అని తనే స్వయంగా చెప్పుకొచ్చింది. అంతేకాదు, స్క్రిప్ట్ చదవకుండానే రాశి ఈ సినిమాకి సంతకం పెట్టేసిందట. ఈ విషయాన్ని తనే స్వయంగా ఓ ఇంటర్వ్యూలో పంచుకుంది. 'నా సినీ జీవితం ప్రారంభమైన నాటి నుంచి పవన్ కల్యాణ్ గారితో కలిసి పనిచేయాలనేది నాకు పెద్ద కల. ఆ కల నెరవేరుతుందని తెలిసిన నిమిషంలో స్క్రిప్ట్ కూడా చదవకుండా సంతకం చేశాను. ఇది నా కెరీర్‌లో కథ చదవకుండా ఒప్పుకున్న మొదటి సినిమా,' అని రాశి ఖన్నా భావోద్వేగంతో చెప్పుకొచ్చింది. ఈ సినిమా మాస్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతోంది. దర్శకుడు హరీష్ శంకర్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. 2026 ఏప్రిల్‌లో 'ఉస్తాద్ భగత్ సింగ్' ప్రేక్షకుల ముందుకు రానుందని తెలుస్తోంది.

# వివాదంలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహం ఏర్పాటు.. అడ్డుకున్నదీ ఎవరు..?



హైదరాబాద్‌లోని ప్రముఖ సాంస్కృతిక కేంద్రమైన రవీంద్రభారతి ప్రాంగణంలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహ ఏర్పాటుపై వివాదం నెలకొంది. డిసెంబర్ 15న ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని భాషా సంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. నటుడు శుభలేఖ సుధాకర్, కమిటీ సభ్యులతో కలిసి పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఏర్పాట్లను పరిశీలించారు. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహావిష్కరణ కార్యక్రమం డిసెంబరు 15న రవీంద్రభారతి ఆవరణలో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సినీ నటుడు శుభలేఖ సుధాకర్ ఆహ్వానించారు. రవీంద్రభారతి ఆవరణలో బాలసుబ్రహ్మణ్యం విగ్రహం ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతించినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

అయితే రవీంద్రభారతిలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహ ఏర్పాటును కొందరు తెలంగాణ వాదులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. విగ్రహ ఏర్పాటు పనులను తెలంగాణ ఉద్యమకారుడు పృథ్వీరాజ్ అడ్డుకునే ప్రయత్నం చేశారు. శుభలేఖ సుధాకర్, పృథ్వీరాజ్ మధ్య వాగ్వాదం జరిగింది. తెలంగాణ గడ్డపై గద్దర్, ప్రముఖ కవి అందెశ్రీ వంటి వారికి ముందు గౌరవం దక్కాలని.. బయటి వ్యక్తులకు ఇక్కడ విగ్రహాలు ఏర్పాటు చేయడానికి అంగీకరించబోమన్నారు పృథ్వీరాజ్. ఈ క్రమంలో శుభలేఖ సుధాకర్ నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు.

రవీంద్రభారతిలో ఎస్పీబీ విగ్రహ ఏర్పాటును తెలంగాణ వాదులు తీవ్రంగా వ్యతిరేకస్తున్నారు. మరి డిసెంబర్ 15న ఎస్పీబీ విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమం జరుగుతుందా..? లేదా..? అన్నది చూడాలి..

Printed and Published, Editor & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com